సూర్య 18వ వసంతంలోకి...
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఆదివారం | 29 డిసెంబర్ 2024 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 68
| పేజీలు 10+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




- APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
- నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
- కరెంట్ అఫైర్స్
- నమూనా ప్రశ్నాపత్రాలు
- విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, మార్గశిర మాసం బ.చతుర్దశి రా.3.31 వరకు, జ్యేష్ఠ రా.11.21, వర్జ్యం లేదు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.4.24 నుంచి 5.12 వరకు

కొత్త సంవత్సరం వేళ
## చలో అయోధ్య



6 లో

- పోటెత్త నున్న పర్యటకులు
- ఇప్పటికే హెూటల్స్ అన్నీ ఫుల్..!
- బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగి ఏడాది

కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, అలాగే బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో భారీగా భక్తులు తరలిరానున్నారు.

హెచ్1బీపై మూర్ఖులను
## తొలగించాలి



6 లో


- మస్క్ పోస్టుపై రిపబ్లికన్ పార్టీ లో తీవ్ర చర్చ
- పార్టీ నేతలు, ట్రంప్ మద్దతు దారుల్లో భిన్నమైన వాదనలు

హెచ్1 బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నా భిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇస్తుంటే.. ఇతరులు మాత్రం అమెరికా ఫస్ట్‌కు కట్టుబడి ఉన్నారు.

# ఇక సెలవ్

- మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు
- ముగిసిన మాజీ ప్రధాని అంత్యక్రియలు
- ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు
- త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు నివాళులు
- అంత్యక్రియలకు హాజరైన రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు
- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు, ముఖ్యమంత్రులు





6 లో

అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. దిల్లీలోని నిగమ్‌బోధ్‌ఘాట్‌లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు.

## వైద్యసాయం అందనీయరా?

- నేత క్షేమం కోరేవారై తే ఇలా చెందుకు చేస్తున్నారు
- రైతు సంఘాల నేతలపై సుప్రీం ఆగ్రహం
- రైతు నాయకుడు దల్లేవాల్‌కు వైద్య సహాయం అందేలా చూడాలని ఆదేశం



6 లో

ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తున్నా. ఆయనకు వైద్య సహాయం అందకుండా అడ్డుకుంటున్న రైతు సంఘాల తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది.

మళ్లీ ఏపీలో
# 108, 104 సేవలు

- 190 కొత్త 108 వాహనాల కొనుగోలుకు నిర్ణయం
- 108 అంబులెన్స్ సిబ్బంది, డ్రైవర్లకు అదనంగా ఇకపై రూ.4 వేలు
- అందుబాటులోకి కొత్తగా 58 మహాప్రస్థానం వాహనాలు
- నాణ్యమైన వైద్యం కోసం ఇన్సూరెన్స్ పద్ధతిలో ఎన్టీఆర్ వైద్యసేవ కార్యక్రమం
- ప్రతి మండలంలో జన ఔషధి స్టోర్స్ ఏర్పాటు
- ప్రివెంటివ్ హెల్త్ కేర్‌కు ప్రాధాన్యం ఇచ్చేలా వైద్య శాఖ ప్రణాళికలు

రాష్ట్రంలో అందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైద్య ఆరోగ్య శాఖను మళ్లీ గాడిన పెట్టి....పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



3 లో

తెలుగు భాషపై మన
## ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి



2 లో

- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో జస్టిస్ ఎన్వీ రమణ

6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో ఆడంబరంగా ప్రారంభమయ్యాయి. కేబీఎన్ కళాశాల కేంద్రంగా 2 రోజుల పాటు జరగుతున్న సభల్లో మొదటి రోజున పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలోని రామోజీరావు ప్రధాన వేదిక అయింది.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

రాష్ట్ర యంత్రాంగంపై
## దాడిగా భావిస్తాం

- అహంకారం, ఆధిపత్య ధోరణితో అధికారులపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారు
- 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదు
- జవహర్ బాబు కుటుంబానికి అండగా ఉంటాం
- ఎంపీడీవోను పరామర్శించి, మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్



2 లో

అహంకారం నడి నెత్తికి ఎక్కిన వైసీపీ నాయకులు అధికారులపై దాడులు చేస్తున్నారు. వీళ్లను ప్రశ్నిస్తే ఎవరైనా ఒకటే.. వీరి ఆధిపత్యం ఒప్పుకోకపోతే ఎవరి మీదనైనా దాడులకు దిగే స్వభావం చూపిస్తార'ని ఉప ముఖ్యమంత్రివర్యులు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.

మన్మోహన్‌కు
## అవమానం



- బీజేపీపై ట్విట్టర్‌లో రాహుల్ గాంధీ విమర్శలు
- ముగిసిన మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు
- పాడె మోసిన రాహుల్ గాంధీ
- ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్‌లో ముగిసిన అంత్యక్రియలు
- సిక్కు సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు

వివరాలు-6లో

టోకెన్లు ఉంటేనే
## తిరుమల రండి


- త్వరలో వైకుంఠ ద్వార సర్వ దర్శన టోకెన్లు రిలీజ్
- డయిల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఈవో జె.శ్యామల రావు
- సిఫార్సు లేఖలు అనుమతించ బోమని వెల్లడి



6 లో

తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం నిర్వహించిన డయిల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఈవో జె.శ్యామల రావు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.

అంతా ఇంతే!




న్యూ ఇయర్ వేడుకలకు ఈడీ రమ్మంటోందా సార్

జనవరి 11న
## చలో తిరుపతి



5 లో

- బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ తొలగించాలి
- గోడ పత్రిక ఆవిష్కరించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

రాష్ట్రంలో రానున్నది
## బీసీల రాజ్యమే

- ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పునాది ఖమ్మం కేంద్రంగా బీసీల రాజ్యాధికార ఉద్యమ నిర్మాణం
- అగ్రకులాలు బీసీల అవకాశాలను హరిస్తున్నాయి
- ఆత్మగౌరవం కోసమే బీసీల రాజ్యాధికార పోరాటం
- రాష్ట్రంలో తీవ్ర వివక్షతకు లోనవుతున్న బీసీలు
- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్

ఉద్యమాలకు, పోరాటాలకు, ప్రజా విప్లవాలకు నిలయమైన ఖమ్మం జిల్లా కేంద్రంగా బీసీల రాజ్యాధికార ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ఉద్ఘాటించారు.



5 లో

ఫార్ములా ఈ రేసింగ్
## కేసులో కీలక పరిణామం



5 లో

- ఒప్పందాల అమలు, డబ్బు చెల్లింపుతో తనకు సంబంధం లేదన్న కేటీఆర్
- ఒప్పందం అమలులో విధానపరమైన అంశాలను చూసే బాధ్యత మంత్రిగా తనది కాదని వెల్లడి
- రూ.10 కోట్లు దాటే చెల్లింపులకు కేబినెట్ అనుమతి తీసుకోవాలని హెచ్‌ఎండీఏ నిబంధనల్లో లేదన్న కేటీఆర్



# వైసీపీ నాయకుడు దొంగ నిరసనలు ఆపి సొంత పార్టీని చక్కదిద్దుకోవాలి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : 'రైతులంతా సంతోషంగా ఉంటే ధర్నాలు అంటూ కథలు చెబుతూ, ప్రజలంతా సౌఖ్యంగా ఉంటే నిరసనలు అంటూ డ్రామాలు చేయడం ఆపి.. వైసీపీ పార్టీ నాయకుడు ప్రజలు, అధికారులపై దౌర్జన్యాలు, బెదిరింపులు చేస్తున్న ఆ పార్టీ నాయకులను నిలువరించడం మీద దృష్టి సారించాల'ని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించారు. ఎన్నికల్లో ప్రజలు దారుణంగా ఓడించి 11 సీట్లకు పరిమితం చేసినా.. అహంకారం మాత్రం ఆ పార్టీ నాయకులకు పోలేదన్నారు. రాయలసీమ ప్రజల సహనంతో వైసీపీ నాయకులు ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపీడీవో జవహర్ బాబు పై వైసీపీ నాయకుడు శ్రీ సుదర్శన్ రెడ్డి దాడి చేసిన కార్యాలయ ఆవరణను ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు శనివారం సాయంత్రం పరిశీలించారు. కడప రిమ్స్ లో చికిత్స పొందుతున్న జవహర్ బాబుని పరామర్శించిన అనంతరం.. నేరుగా గాలివీడు మండలం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. ఘటన జరిగిన తీరును కార్యాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం జరిగిన సంఘటన తాలూకా వివరాలను, జవహర్ బాబుపై దాడి జరిగిన కార్యాలయ గదిని పరిశీలించారు. సిబ్బందిని పిలిచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని మీడియాతో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నేను ఉద్యోగుల్లోనూ, రాయలసీమ ప్రజల్లోనూ ఆత్మస్థైర్యం నింపడానికి ఈ పర్యటనకు వచ్చాను. గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పడుతున్న కష్టాల నుంచి మెల్లగా బయటకు వస్తున్న తరుణంలో వైసీపీ నాయకులు మళ్లీ రౌడీయిజం, గూండాయిజం అంటూ పేట్రేగిపోతున్నారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు మర్చిపోయినట్లున్నారు. ప్రజలపై, అధికారులపై అసహనం వ్యక్తం చేస్తూ ఇష్టానుసారం దాడులకు తెగబడుతున్నారు. మరోసారి ఇలాంటిది జరిగితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. ప్రజలకు అధికారులకు ఏ మాత్రం వైసీపీ నాయకులు కార్యకర్తలు ఇబ్బంది పెట్టిన కఠినమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# రాజ్యాంగ రచనలో తెలుగువారి పాత్ర చిరస్మరణీయం


- ప్రముఖుల చిత్రాలు
- చరిత్రతో వినూత్నంగా అసెంబ్లీ కేలండర్
- ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఆనాటి రాజ్యాంగ రచనలో భాగస్వామ్యులైన తెలుగు ప్రముఖులను స్మరించుకునేలా 2025వ సంవత్సరానికి రూపొందించిన నూతన కేలండర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉండవల్లిలోని నివాసంలో ఆవిష్కరించారు. కేలండర్లో ప్రచురించిన ఒక్కో ప్రముఖుడి గొప్పతనాన్ని ముఖ్యమంత్రి ఈ కార్యక్రమంలో మరోసారి గుర్తుచేశారు. సైమన్ గో బ్యాక్ అంటూ తెల్లదొరలను ఎదిరించి స్వాతంత్ర్య ఉద్యమంలో తెగువ చూపిన తెలుగు ధీరుడు శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు భారత రాజ్యాంగ రచనలోనూ అంతే చొరవ కనబరిచారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శ్రీ టంగుటూరి రాజ్యాంగంలోని ప్రధానమైన స్థానిక సంస్థలు, గవర్నర్ విచక్షణ అధికారాలు వంటి అంశాలను రూపొందించడంలో సహాయసహకారాలు అందించారని కీర్తించారు. అలాగే శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య రాజ్యాంగ సభ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా సేవలు అందించారని, ఢిల్లీలో పరిపాలన శాసనసభ వ్యవస్థపై సిఫార్సులు చేసిన కేంద్రపాలిత ప్రాంతాల కమిటీకి నేతృత్వం వహించారని ముఖ్యమంత్రి చెప్పారు.

**రాజ్యాంగంలో కీలక సూచనలు :** శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ జాతీయ భాష, న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం, మానవ అక్రమ రవాణాపై చేసిన కీలక సూచనలను రాజ్యాంగ సభ ఆమోదించిందని ముఖ్యమంత్రి అన్నారు. శ్రీ మోటూరి సత్యనారాయణ జాతీయ భాష గురించి విలువైన సలహాలిచ్చారని, మరో ప్రముఖుడు శ్రీ గోగినేని రంగనాయకులు(ఎన్జీ రంగా) రాజ్యాంగంలో అధికార వికేంద్రీకరణ, అత్యవసర అధికారాలు, రెండు సభలు, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై పలు సూచనలు చేశారని ముఖ్యమంత్రి వివరించారు.

**ప్రజాస్వామ్యం ప్రతిబింబించేలా కృషి :** భూ సేకరణకు నష్ట పరిహారం చెల్లించేలా నిబంధన తీసుకురావడంతో పాటు పాఠశాలలు, దేవాలయాల్లో ఎక్కడా వివక్ష ఉండకూడదని మతం, జాతి, కులం, లింగం ఆధారంగా నిరాదరణ చూపించకుండా నిబంధన రూపొందించాలని శ్రీ వీసీ కేసవరావు రాజ్యాంగసభలో ప్రతిపాదించారని ముఖ్యమంత్రి చంద్రబుబు తెలిపారు. డ్రాఫ్టింగ్ కమిటీ, అడ్వైజరీ కమిటీ, ప్రాథమిక హక్కులపై సబ్–కమిటీతో సహా తొమ్మిది కమిటీలలో శ్రీ అల్లాడి కృష్ణస్వామి భాగస్వామిగా ఉన్నారని; పౌరసత్వం, ప్రాథమిక హక్కులు, ఎమర్జెన్సీ నిబంధనలపై రాజ్యాంగ సభలో జరిగిన చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారని ముఖ్యమంత్రి చెప్పారు. రాజ్యాంగంలో మహాత్మా గాంధీ ఆలోచనలు ప్రతిబింబించేలా శ్రీ మొసలికంటి తిరుమలరావు కృషి చేస్తే.. ఆస్తి హక్కు, జమీందారీ వ్యవస్థ రద్దు గురించిన చర్చలో శ్రీ కళా వెంకటరావు ప్రముఖంగా పాల్గొన్నారని ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్రముఖుల స్మరణ సంతోషంగా ఉంది :** నీలం సంజీవరెడ్డి, కల్లూరు సుబ్బారావు, రాజా శ్వేతా చలపతి రామకృష్ణరంగారావు రాజ్యాంగ రూపకల్పనలో అందించిన సహకారాన్ని మరువలేమని ముఖ్యమంత్రి అన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి బాధ్యత వహించిన నాయకులను దార్శనికులను స్మరించుకోవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాజ్యాంగ రచనలో అద్వితీయమైన సేవలందించిన తెలుగు ప్రముఖులు కీర్తిశేషులు టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అల్లాడి కృష్ణస్వామి, కల్లూరు సుబ్బారావు, కళా వెంకట రావు, ఆచార్య ఎన్ జీ రంగా, మొసలికంటి తిరుమల రావు, రాజా శ్వేతా చలపతి రామకృష్ణ రంగారావు, మోటూరి సత్యనారాయణ, దుర్గాబాయి దేశ్ ముఖ్, నీలం సంజీవ రెడ్డి, వి సి కేశవ రావు ల చిత్ర పటాలతో పాటు, ఆనాడు సభలో వారు చేసిన ప్రసంగాంశాలను లభ్యమైన మేరకు ఈ కేలెండర్లో పొందుపరచారు.



**ఇక సామాజిక మాధ్యమాల్లో శాసన వ్యవస్థ సమాచారం :** ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ కోసం తొలిసారి ప్రవేశపెట్టిన సామాజిక మాధ్యమ ఖాతాలను కూడా ప్రారంభించారు. ఎక్స్, యూట్యూబ్‌లో ద్వారానూ; ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ద్వారా ఇకపై ఎప్పటికప్పుడు శాసన వ్యవస్థకు సంబంధించిన సమాచారం తక్షణం అందుబాటులోకి వస్తుంది. సభా కార్యకలాపాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చంద్రబాబు అన్నారు. సామాజిక మాధ్యమాలు కేవలం సమాచారం కోసమే కాకుండా చట్ట సభల్లో అర్థవంతమైన చర్చలకు వేదిక కావాలని, సమాజంలో అవగాహన పెంచడానికి తోడ్పడాలని చంద్రబాబు నాయుడు చెప్పారు. సవాళ్లను స్వీకరించి, శాసనవ్యవస్థ చేపట్టిన వినూత్న ప్రయత్నాలకు మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కె రఘు రామకృష్ణ రాజులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె రఘు రామకృష్ణ రాజు, రాష్ట్ర శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర పాల్గొన్నారు.

# తెలుగు భాషాభివృద్ధిపై మన ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి

- తెలుగు భాష అందమైన భాష
- సర్కారుకు చురకలు
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో జస్టిస్ ఎన్వీ రమణ



విజయవాడ : 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో ఆడంబరంగా ప్రారంభమయ్యాయి. కేబీఎన్ కళాశాల కేంద్రంగా 2 రోజుల పాటు జరగుతున్న సభల్లో మొదటి రోజున పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలోని రామోజీరావు ప్రధాన వేదిక అయింది. ఈ సందర్భంగా హాజరైన సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. తెలుగు సాహిత్యం, వైభవం గురించి మాట్లాడిన సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ.. పర భాషను నేర్చుకోండి, కానీ వ్యామోహం పెంచుకోకండని సూచించారు. నందమూరి తారక రామారావు వంటి వారి వల్ల మన భాషకు, తెలుగు వాళ్లకు గౌరవం పెరిగిందని చెప్పారు.

**అక్కడ ఉన్న ఐక్యత, మన దగ్గర లేదు**

తమిళనాడులో తమ భాషాభివృద్ధి కి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని ఎన్వీ రమణ చెప్పారు. ఆ తరహాలో మన దగ్గర పాలకులు స్పందించడం లేదని, అక్కడ ఉన్న ఐక్యత, మన దగ్గర లేదని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలను కూడా తెలుగు భాషోద్యమంలో భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ప్రజల మద్దతుతోనే మన ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు.

**సర్కారుకు చురకలు**

వ్యాపార, రాజకీయ ప్రయోజనాలతో తెలుగు భాషను అణగదొక్కుతున్నారని.. తెలుగు భాషాభివృద్ధిపై మన ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదని ఎన్వీ రమణ ఆరోపించారు. తగినంత గుర్తింపు కూడా మన భాషకు దక్కడం లేదన్నారు. కొన్ని దేశాల్లో వారి మాతృభాషలో విద్యాబోధన చేసి అద్భుతాలు సాధించారని, వారి సాంకేతికతను, విజయాలను వారి భాషలోనే రాసుకుంటున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ తరహాలో మన తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వాలు కూడా తెలుగు భాషలోనే ఆదేశాల కాపీలు ఇచ్చే ఆలోచన చేయాలని, తెలుగు భాష వైభవం వల్లే తెలుగు రాష్ట్రాలకు కీర్తి ఉంటుందన్నారు. తెలుగు భాషను పరిపుష్టం చేయాలనే అలోచనపై ప్రభుత్వం సానుకులంగా స్పందించాలని కోరారు. మీడియా కూడా అందుకు సహకరించాలని, లేదంటే భవిష్యత్తు లో తెలుగు పేపర్లు, ఛానళ్లు చూసే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.

పర భాషపై వ్యామోహం తగదు మన సంస్కృతి నాశనం కాకుండా చూసుకోవాలని గాంధీజీ చెప్పేవారని ఎన్వీ రమణ గుర్తు చేసుకున్నారు. పర భాషను నేర్చుకోవాలి కానీ.. వ్యామోహం పెంచుకోకండని సూచించారు. ప్రస్తుతం పెట్టుబడిదారులు ఇంగ్లీషు భాష ఉంటేనే ఉద్యోగాలు అనే పరిస్థితి కల్పించారని, కానీ తెలుగు మీడియంలో చదివి కూడా దేశ విదేశాల్లో రాణిస్తున్న వారు ఎందరో ఉన్నారని చెప్పారు. కొన్ని దేశాల్లోనూ వారి మాతృభాషలో విద్యాబోధన చేసి అద్భుతాలు సాధించారన్నారు.

**తెలుగు భాష – అందమైన భాష**

ఒక సంగీతం తరహాలో తెలుగు భాష అనేది ఓ అందమైన భాష అని ఎన్వీ రమణ అన్నారు. మానవ బంధాలతో కుడిన రచనలే కలకాలం నిలిచి ఉంటాయని, కన్యాశుల్కం వంటి రచనలే అందుకు ఉదాహరణ అని చెప్పారు. తెలుగు భాషకు మద్దతు ఇచ్చేవారికే ఓటు అని ప్రజలతో చెప్పించండని, అప్పుడే మన భాష అభివృద్ధి అవుతుందని, వైభవం తప్పకుండా సాకారం అవుతుందని ఎన్వీ రమణ వివరించారు. ఇక మార్పు పేరుతో ముద్రించిన మాహా సభల ప్రచురణ గ్రంధాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి.. ఇతర భాషలు నేర్చుకోండి.. కానీ మాతృభాషపై మమకారం పెంచుకోండని చెప్పారు. ప్రపంచంలో అన్ని రంగాల్లోనూ తెలుగు వాళ్లు ముందంజలో ఉన్నారన్నారు. కృత్రిమ విధానంలో భాష తెలుసు కోవడం సరి కాదని, సహజసిద్ధంగా ఉండేలా మాతృ భాషపై పట్టు సాధించాలని సూచించారు. ఇంగ్లీష్ రాకుండానే కపిల్ దేవ్ ఇండియా కెప్టెన్ అయ్యారని, ఆ తర్వాత భాష నేర్చుకున్నారన్నారు. అదే తరహాలో అందరూ మాతృభాషపై మక్కువ పెంచుకోండి, తర్వాత పరభాష నేర్చుకోండని చెప్పారు. ప్రపంచ తెలుగు రచయిత ల సంఘం సంస్థాగతంగా వృద్ధి చెందడానికి తన వంతు సహకారం అందిస్తానని సుజనా చౌదరి హామీ ఇచ్చారు.

# జవహర్ బాబుపై దాడి... రాష్ట్ర యంత్రాంగంపై దాడిగా భావిస్తాం

- అహంకారం, ఆధిపత్య ధోరణితో అధికారులపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారు
- 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదు
- అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బ తీసేలా ప్రవర్తిస్తే కఠినంగా ఉంటాం
- రాయలసీమ యువతలో ఎలాంటి దాష్టికాలను అయినా ఎదిరించే ధైర్యం రావాలి
- జవహర్ బాబు కుటుంబానికి అండగా ఉంటాం
- వైసీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి దాడిలో గాయపడి కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు
- ఎంపీడీవోను పరామర్శించి, మీడియాతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : 'అహంకారం నడి నెత్తికి ఎక్కిన వైసీపీ నాయకులు అధికారులపై దాడులు చేస్తున్నారు. వీళ్లను ప్రశ్నిస్తే ఎవరైనా ఒకటే.. వీరి ఆధిపత్యం ఒప్పుకోకపోతే ఎవరి మీదనైనా దాడులకు దిగే స్వభావం చూపిస్తార'ని ఉప ముఖ్యమంత్రివర్యులు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. తమను ప్రశ్నించే వాళ్లను, ఎదురు చెప్పే వాళ్లను వైసీపీ నాయకులు దాడి చేసి భయపెట్టడం నైజంగా మార్చుకున్నారని చెప్పారు. ఇలాంటి వారి అహంకారం దించుతాం.. తోలు తీసి కింద కూర్చోబెడతామని హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపీడీవో జవహర్ బాబు పై వైసీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి చేసిన దాడి అధికార యంత్రాంగం మొత్తం మీద చేసిన దాడిగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అధికారిక విధుల్లో ఉన్న గాలివీడు మండలం ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నాయకుడు సుదర్శన్ రెడ్డి సుమారు 20 మంది అనుచరులతో వచ్చి కార్యాలయంలోనే దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలు పాలైన జవహర్ బాబు ని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించిన నేపథ్యంలో విషయం తెలిసిన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. జవహర్ బాబు ని కలిసి పరామర్శించేందుకు కడప రిమ్స్ ఆసుపత్రికి శనివారం మధ్యాహ్నం వచ్చారు. చికిత్స పొందుతున్న జవహర్ బాబు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.జవహర్ బాబు కి పలు ఆరోగ్య సమస్యలు ఉన్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని, మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలోనే ఉన్న జవహర్ బాబు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

అనంతరం ఆసుపత్రి బయట మీడియాతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఎంపీడీవో శ్రీ జవహర్ బాబు గారిపై దాడికి పాల్పడిన వ్యక్తి చట్టం గురించి తెలిసిన వ్యక్తి. గతంలో ఏపీ స్టేట్ లా ప్రాసిక్యూషన్ ఆఫీసర్ గా ఉన్నారు. చట్టాలు గురించి తెలిసిన వ్యక్తి. అలాంటి వ్యక్తి కూడా మండలానికి కలెక్టర్ వంటి అధికారి అయిన ఎంపీడీవోపై భౌతిక దాడికి పాల్పడడం అనాగరికం.. హేయం. సదరు వైసీపీ నాయకుడి అమ్మగారు ఎంపీపీగా పని చేస్తున్నారు. ఆమె ప్రజాప్రతినిధి అయితే ఆమె కార్యాలయ తాళాలు ఆమెకే ఇవ్వాలి. ఆ కార్యాలయ తాళాలు ఇవ్వను అని నిబంధనలు గురించి చెబితే ఎంపీడీఓ జవహర్ బాబుపై తీవ్రంగా దాడి చేయడం అప్రజాస్వామికం. ష్ట్రంలో 640 పైచిలుకు మండలాలు ఉన్నాయి. ప్రతి మండలానికి ఎంపీడీఓ అంటే అభివృద్ధికి బాధ్యత వహించే వ్యక్తి. అలాంటి ఎంపీడీఓపై అహంకారంతో ఇష్టం వచ్చినట్లు దాడి చేయడం ఏమిటి? ఇది ఒక్కరి మీద జరిగిన దాడిగా మేము భావించడం లేదు. రాష్ట్ర యంత్రాంగం మీద జరిగిన దాడిగా భావిస్తున్నాం. ఎంతటి వారు ఉన్న సరే చట్టం ముందుపెడతాం. చట్టం తెలిసిన వారైనా ఈ విషయంలో ప్రజలకు అధికార యంత్రాంగానికి జవాబు చెప్పి తీరాల్సిందే. ప్రజల కోసం పనిచేస్తున్న అధికారులపై భౌతిక దాడులకు పాల్పడితే వారి ఆత్మస్థైర్యం పూర్తిగా దెబ్బ తింటుంది. భవిష్యత్తులో కూడా బలంగా పని చేయలేరు. అధికార యంత్రాంగాన్ని భయపెట్టాలని భావిస్తే మేం చూస్తూ ఊరుకోం.

**11 సీట్లు ఇచ్చినా బుద్ధి రాలేదు :** వైసీపీ నాయకులను ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసిన వారి అహంకారం తగ్గలేదు. అహంకారంతో కొట్టుకొని ఈ పరిస్థితికి వచ్చారు. స్తుతం ఎంపీడీవో జవహర్ బాబు పై దాడి చేసిన జల్లా సుదర్శన్ రెడ్డి అనే వ్యక్తికి దాడులు చేయడం కొత్త కాదు. గతంలో కూడా ఎంపీడీవో గా పనిచేసిన ప్రతాప్ అనే అధికారిపైనా ఇదే జల్లా సుదర్శన్ రెడ్డి దాడి చేశారు. శేఖర్ నాయక్, శ్రీనివాసులు రెడ్డి అనే అధికారులు మీదా దాడి చేశారు. ఇది మా రాజ్యంగం అనుకొని ఇష్టానుసారం అందరి పై దాడులు చేస్తున్నారు. చట్టం ముందు ఎవరైనా ఒక్కటే. వీరి ఆధిపత్య అహంకారాన్ని తగ్గించుకోకపోతే ప్రజలే బుద్ది చెబుతారు. వారికి ఎదురు చెబితే దాడి చేస్తున్నారు.

**తీవ్రంగా గాయపరిచారు :** ఎంపీపీకి మాత్రమే తాళాలు ఇస్తామని చాలా మర్యాదగా, హుందాగా చెప్పిన జవహర్ బాబు గారిపై ఇష్టానుసారం దాడి చేశారు. గడియ వేసి దాడికి తెగబడ్డారు. ఇది క్షమించరాని నేరం. శ్రీ జవహర్ బాబు గారికి గతంలో ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. హైబీపీతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. భౌతికంగా దాడి చేయడమే కాకుండా ఆయన కులాన్ని కూడా దూషించి.. సుదర్శన్ రెడ్డి తన అహంకారాన్ని మరోసారి చూపించారు. వీరి ఆధిపత్యాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై దాడి చేయడం అలవాటుగా మారింది. ఇది గత ప్రభుత్వం అని, ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది అని అనుకుంటున్నట్టు ఉన్నారు. తప్పు జరిగితే చూస్తూ ఊరుకునే వ్యక్తిని కాదు. ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నేను తప్పు చేసినా బలంగా శిక్ష పడాలి అని భావించే వ్యక్తిని. అలాంటిది అధికారిక విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దాడి చేయడం తీవ్రంగా పరిగణిస్తాం. సంఘటన జరిగిన వెంటనే జిల్లా కలెక్టర్ ఎస్పీలతో మాట్లాడి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

**అధికారులకు అండగా కూటమి ప్రభుత్వం :** ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగంపై దాడులు చేస్తే ఏ మాత్రం సహించేది లేదు. నిబద్ధతగా పనిచేసే అధికారులకు కూటమి ప్రభుత్వం తోడుగా ఉంటుంది. అధికారుల మీద భౌతిక దాడులు పాల్పడితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. ఇలా అహంకారంతో దాడులు చేసే వారికి ఎలాంటి శిక్ష పడాలో అలాంటి శిక్ష పడుతుంది. ప్రజల విషయంలో కూటమి ప్రభుత్వం త్రికరణ శుద్ధిగా పని చేస్తుంది. శ్రీ జవహర్ బాబు గారు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు అని ఇక్కడికి రాలేదు. నేను ఈ రోజు ఇక్కడికి రావడానికి కారణం రాజకీయాలకు అతీతంగా, కులాలకు అతీతంగా కష్టపడి పని చేసే అధికారులకు ధైర్యం చెప్పడానికి వచ్చాను. విధులు నిర్వర్తిస్తున్న వారిపై ఇష్టానుసారం భౌతిక దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదు. కేసులో ఉన్న అందర్నీ తప్పనిసరిగా పట్టుకోవాలని తప్పించుకున్న తొమ్మిది మందిని కూడా వెంటనే పట్టుకోవాలని ఎస్పీ గారికి చెప్పాం. ఈ కేసులో నిందితులందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, చట్టపరంగా శిక్ష పడేలా చూస్తాం.



**రాయలసీమ యువతలో చైతన్యం రావాలి :** బాధితుడైన ఎంపీడీఓ శ్రీ జవహర్ బాబు గారి భార్య భయపడుతున్నారు. అలాంటి పరిస్థితికి ఇక్కడ ప్రజలను కొందరు తీసుకొని వచ్చారు. ఆ పార్టీ నాయకుడికి సూచిస్తున్నాను... వాళ్ల పార్టీలో ఇలాంటి దౌర్జన్యం చేసే వారిపై దృష్టి పెట్టి సరి చేసుకోవాలి. ప్రజలు ఇలాంటి బెదిరింపులను ఎదిరించి 11 సీట్లు ఇచ్చినా వాళ్ళకి బుద్ధి రాలేదు. రాయలసీమ ప్రజలకు... ముఖ్యంగా యువతకు, మహిళలకు నేను చెబుతున్నది ఒక్కటే. దేనికి, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలతో పేట్రిగిపోయినప్పుడు కచ్చితంగా యువత ప్రశ్నించాలి. అవసరమైతే దాడులు చేసే వారికి ఎదురు తిరగాలి. ఓటు వేసేశాం అక్కడితో పని అయిపోయింది అనుకోవద్దు. కచ్చితంగా మార్పు యువత నుంచే రావాలి. తప్పు చేసేవారు ఎంతటి వారైనా యువత వారిని వదిలిపెట్టదు. ఆఖరికి కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న దళిత అధికారులకు కూడా రక్షణ కరవైంది. వారు ప్రజల కోసం స్వేచ్ఛగా పని చేయలేని పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి నాయకులను మళ్లీ మరోసారి ఎన్నికల్లో పాల్గొనసీయకుండా యువతే చేయాలి. వారికి 11 సీట్లు ప్రజలు ఇచ్చినా బుద్ధి రాలేదని అర్థమవుతుంది. ఇలాంటి నాయకులు మాకు అక్కర్లేదు అని ప్రజలే బలంగా చెప్పాలి. రాయలసీమ యువతకు అండగా నిలుస్తాం. అధికారిక ఆధిపత్య అహంకారం ఎదిరించేందుకు సమష్టిగా ఎదుర్కొందాం. అధికారులపై దాడులు చేసే ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పక్కా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చాం.

# తెలుగు నేల పులకిస్తోంది

## ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణపై సీఎం ట్వీట్




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారందరికీ గర్వకారణం. మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తోన్న ఈ మహాసభలు జరిగే ప్రాంగణానికి, అమరజీవి పొట్టి శ్రీరాములు గారి పేరును పెట్టడం ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన అద్వితీయ త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోంది. అలాగే ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రామోజీరావు గారి పేరు పెట్టడం కూడా అభినందనీయం. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగుభాషాభిమానులకు అందరికీ ధన్యవాదాలు. ఈ మహా సభలు విజయవంతం అవ్వాలని కోరుకుంటూ.... నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను.

# పవన్‌ని కలిసిన ఎమ్.పి.డి.ఓ.ల సంఘం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : గాలివీడు మండల ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడి ఘటన నేపథ్యంలో విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులకు భరోసా, ధైర్యం ఇవ్వాలని ఎమ్.పి.డి.ఓ.ల సంఘం ప్రతినిధులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి విజ్ఞప్తి చేశారు. రాయచోటిలో పవన్ కళ్యాణ్ ని కలిసిన ఎమ్.పి.డి.ఓ.ల సంఘం ప్రతినిధులు విజ్ఞాపన పత్రం అందజేశారు. వారు ప్రస్తావించిన అంశాలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ లతో ఉప ముఖ్యమంత్రి చర్చించారు

# వరద బాధితులకు టీటీడీ ఉద్యోగుల వితరణ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వరద బాధితుల సహాయార్థం తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులు, పెన్షనర్స్ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడుని ఉండవల్లి నివాసంలో శనివారం కలిసి ఉద్యోగుల తరవున రూ. 1,18,36,798, పెన్షనర్స్ తరవున రూ. 71.59 లక్షల చెక్కును విరాళంగా అందించారు. వీరిని సీఎం అభినందించారు. అంతకముందు టీటీడీ అర్చకులు సీఎం చంద్రబాబును ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్రారంభమైన తెలుగు రచయితల సభలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మాతృభాషను భవిష్యత్తు తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా ప్రపంచ ఆరో తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలుగు తల్లి విగ్రహానికి సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ నివాళులర్పించారు. మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ అంజలి ఘటించారు. నగరంలోని కె.బి.ఎన్.కళాశాల ప్రాంగణంలో నేటి నుంచి రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల కోసం దేశవిదేశాల నుంచి 1500మందికి పైగా కవులు, రచయితలు, భాషాభిమానులు తరలివచ్చారు.

# ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ జాగీర్లు కాదు



అన్నమయ్య జిల్లా (గాలివీడు), మేజర్ న్యూస్; ప్రభుత్వ కార్యాలయాలు వైకాపా జాగీర్లు కాదని,అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదని డిప్యూటీ సీ.ఎం కొణిదెల పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చమకూరి,ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలసి గాలివీడు పట్టణంలోని స్థానిక మండలప్ర జాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ జవహర్ బాబుపై జరిగిన దాడిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ కుమారుడు జల్లా సుదర్శన్ రెడ్డి ఎంపీపీ ఛాంబర్ తాళాలు ఇవ్వాలని అడుగగా ఎంపీపీ పద్మావతమ్మ వస్తే ఇస్తానని,ఇతరులకు ఇవ్వలేమని సమాధానమివ్వగా ఉద్వేగంతో ఊగిపోయిన జల్లా సుదర్శన్ రెడ్డి ఆయన అనుచరుడు వెంకట్రెడ్డి మరో పదిహేను మంది అనుచరులతో ఎంపిడిఓను తన గదిలో నిర్బంధించి ఎంపిడిఓ ఛాతీపై సుదర్శన్ రెడ్డి తన్ని క్రింద పడవేసి పిడుగుద్దులతో,కుర్చీలతో దాడి చేసి అమానుషంగా దాడి చేశారన్నారు.అక్కడితో ఆగక అడ్డొచ్చిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా చితకబాధారన్నారు.వెంటనే అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది,ఉపాధి సిబ్బంది తలుపులు బద్దలు కొట్టి ఎంపిడిఓను రక్షించారన్నారు. అంతటి దాడికి పాల్పడిన సుదర్శన్ రెడ్డి,తన అనుచరులు దర్జాగా మరో గంట వరకూ ఎంపిడిఓ కార్యాలయంలో స్వైరవిహారం చెయ్యడం వారి బరితెగింపుకు నిదర్శనమన్నారు.సత్వరం స్పందించిన ఎస్సై రామకృష్ణ ,సీ.ఐ కొండారెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని దాడులకు పాల్పడిన వారిని అదువులోకి తీసుకున్నారన్నారు.వైకాపా నాయకుడు జల్లా సుదర్శన్ రెడ్డికి ఇలాంటి దాడులు కొత్తేమీ కాదని గతమంతా కూడా నేరచరిత్రేనన్నారు. గతంలో గాలివీడు మండలంలో ఎంపిడిఓలుగా విధులు నిర్వహించిన ప్రతాప్ ,శ్రీనువాసులు రెడ్డి,శేఖర్ నాయక్ పై కూడా అనేకమార్లు తన అనుచరులతో దాడులకు పాల్పడ్డారన్నారు.

# ప్రభుత్వాలు మారినా.. విధానాలు మారలేదు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఆరు నెలలు గడిచినా విధానాలు మాత్రం మారలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా పునాది ఎలా పెంచుకోవాలి, ఎలా విస్తరించాలి, ఏయే అంశాలపై ఉద్యమించాలి అనే అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మూడు రోజులపాటు నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభలో విస్తృత కార్యాచరణపై చర్చిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రయో జనాలను వైసిపి, టిడిపి, జనసేన పక్కనపెట్టి, వారి సొంత ప్రయోజనాలు, రాజకీయ ప్రయోజ నాలు చూసుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిం దన్నారు. ప్రభుత్వం మారినా ప్రజలు ఆశించిన మార్పు జరగలే దన్నారు. ప్రజానుకూల ప్రభుత్వం, అసమానతలు లేని అభివృద్ధి రావాలి అనే నినాదంతో రాష్ట్ర మహాసభలో ప్రధాన అజెండాగా చర్చిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలల్లో రూ. 16 వేల కోట్ల అదనపు భారాన్ని మోపిందని, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నామని చెప్పకుండా దొడ్డిదారిన ట్రూ అప్ ఛార్జీల భారం వేసిందని విమర్శించారు. జనవరి నుంచి మళ్లీ 45 నుంచి 50 పైసలు మేర ఛార్జీలు పెంచబోతున్నారని తెలిపారు. విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో తగలబెట్టాలని పిలుపునిచ్చారు. విద్యుత్ రెగ్యులేటర్ కమిటీ నిర్ణయాలపై, ప్రజలపై భారాలు వేయడాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 7, 10 తేదీల్లో విజయవాడ, కర్నూలులో పెద్దఎత్తున ధర్నాలు చేపడతామని చెప్పారు.



# అధికారులపై దాడులు చేసేవారిని వదిలిపెట్టం : హోం మంత్రి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అనుకుంటున్న ఎంపిడిఒ జవహర్ బాబుతో హూం శాఖ మంత్రి అనిత ఫోన్ లో మాట్లాడారు. ఎంపీడీఓపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడానికి చర్యలు తీసుకుంటామని హెూం మంత్రి హామీ ఇచ్చారు. అధికార్లపైనే కాదు. ఎవరిపై అయిన సరే. దౌర్జన్యాలు, రౌడీయిజం ప్రదర్శిస్తే, రౌడీషీట్లు తెరుస్తామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అధికారులు, సామాన్యులపై వైసీపీ నాయకుల దాడి వారి ఆధిపత్యం, అహంకారానికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిపై పిడి గుద్దులతో విరుచుకుపడిన ఘటనను కూటమి ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు ప్రభుత్వం మారినా కడప జిల్లాలో అధికారులు, సామాన్యులపై దాడులు జరుగుతుండడం వైసీపీ నాయకుల అహంకారానికి ఆధిపత్య ధోరణికి నిదర్శనమన్నారు. ఈ విషయంలో ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు.

# ఇకపై 108, 104 సేవలకు సింగిల్ సర్వీస్ ప్రొవైడర్

● 190 కొత్త 108 వాహనాల కొనుగోలుకు నిర్ణయం ● 108 అంబులెన్స్ సిబ్బంది, డ్రైవర్లకు అదనంగా ఇకపై రూ.4వేలు ● అందుబాటులోకి కొత్తగా 58 మహాప్రస్థానం వాహనాలు ● నాణ్యమైన వైద్యం కోసం ఇన్సూరెన్స్ పద్ధతిలో ఎన్టీఆర్ వైద్యసేవ కార్యక్రమం ● ప్రతి మండలంలో జన ఔషధి స్టోర్స్ ఏర్పాటు ● ప్రివెంటివ్ హెల్త్ కేర్ కు ప్రాధాన్యం ఇచ్చేలా వైద్య శాఖ ప్రణాళికలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో అందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైద్య ఆరోగ్య శాఖను మళ్లీ గాడిన పెట్టి....పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పలు కీలక ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో వైద్య ఆరోగ్య శాఖపై శనివారం సీఎం సమీక్ష చేశారు. వైద్య శాఖలో పేరుకుపోయిన సమస్యలు, తీసుకురానున్న సంస్కరణలపై చర్చించారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్‌పై వైద్య ఆరోగ్య శాఖ దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. 104 సర్వీసుల ద్వారా రక్త పరీక్షలు సహా పలు టెస్టులు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునే విధానాన్ని పైలెట్‌గా ప్రారంభించాలని సీఎం నిర్ణయించారు. ప్రజల హెల్త్ రిపోర్టులు రూపొందించడం, ప్రభుత్వ పరంగా ఆరోగ్య పరీక్షలు చేసి హెల్త్ కార్డ్ ఇచ్చే విధానాలను అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని సీఎం అన్నారు. సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ ఆసుపత్రికి వచ్చే అవసరం లేకుండా..సాంకేతికత ద్వారా వైద్య సాయం పొందే పరిస్థితి తీసుకురావాలని సీఎం అన్నారు. వైద్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచించాలని సీఎం సూచించారు.

**కొత్త అంబులెన్స్‌ల కొనుగోలుకు నిర్ణయం**

ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం, 108, 104 సేవలు, ఎన్టీఆర్ వైద్య సేవను బీమా విధానంలో తీసుకువచ్చి నాణ్యమైన వైద్యసేవలు అందించే విషయంపైనా అధికారులతో సీఎం చర్చించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 108, 104 సర్వీసులకు విడివిడిగా ఆపరేటర్లు ఉండేవారు. 2020 తరువాత కాల్ సెంటర్‌తో కలిపి ముగ్గురు ఆపరేటర్ల ద్వారా సేవలు అందించారు. ప్రభుత్వం నేడు మళ్లీ కొత్తగా టెండర్లకు వెళ్లనున్న నేపథ్యంలో సింగిల్ ఆపరేటర్ ద్వారా మూడు సేవలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న 108 సర్వీసులు అందిస్తున్న 190 అంబులెన్స్‌లు ఫిట్‌నెస్ కోల్పోయాయి. 2016లో కొనుగోలు చేసిన వీటిని మార్చాల్సి ఉంది. ఇందులో 54 వాహనాలు 5 లక్షల కి.మీ కంటే ఎక్కువ తిరిగి ఉండగా.....65 వాహనాలు 4 లక్షల కి.మీపైగా తిరిగాయి. 71 వాహనాలు 2.5 నుంచి 4 లక్షల కి.మీ తిరిగాయి. వీటిని అన్నింటినీ పూర్తిగా మార్చి కొత్తవాహనాలు కొనుగోలు చేయాలనే ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. వీటి కోసం రూ.60 కోట్లు ఖర్చుఅవుతుంది. 104 సర్వీసుల్లో గతంలో ల్యాబ్ టెక్నిషియన్ ఉండేవారు. మైక్రోస్కోప్, స్క్రీనింగ్ పరీక్షలు చేసేవాళ్లు. రాపిడ్ డయాగ్నోస్టిక్ కిట్స్ అందుబాటులో ఉండేవి. గత ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేసింది. గ్రామాల్లో వైద్య సేవలు అందించడంలో కీలకమైన 104 అంబులెన్స్‌లను బలోపేతం చేసేందుకు ల్యాబ్ టెక్నిషియన్ ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల టెస్టులు చేసే సౌలభ్యాన్ని మళ్లీ తీసుకురానున్నారు.

**108 సిబ్బందికి అదనంగా రూ.4 వేలు**

108 సర్వీసులో సిబ్బంది, డ్రైవర్ 12 గంటల పాటు డ్యూటీలో ఉంటారని...వీరికి జీతంతో కలిపి అదనంగా రూ.4 వేలు చెల్లించేవారు. అయితే గత ప్రభుత్వం రూ.2 వేలు మాత్రమే ఇచ్చింది. దీన్ని తిరిగి పెంచి....గతంలో ఇచ్చినట్లు ఇకపై జీతానికి అదనంగా రూ.4 వేలు ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆసుపత్రుల్లో చనిపోయిన వారి మృతదేహాలు తరలించేందుకు మహాప్రస్థానం వాహనాలను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం వాటి సంఖ్య పెంచాల్సి ఉందని అధికారులు తెలపగా సీఎం దానికి కూడా అంగీకరించారు. ఇందులో భాగంగా 58 మహాప్రస్థానం వాహనాలను సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా అందుబాటులోకి తేనున్నారు. దీనికి యేడాదికి రూ.9.45 కోట్లు అదనంగా ఖర్చు అవనుంది. ఆసుపత్రుల వద్ద అంబులెన్స్ మాఫియా వంటి ముఠాల ఆగడాలు సాగడానికి వీల్లేదని సీఎం అధికారులకు స్పష్టంచేశారు. ఆత్మీయులను కోల్పోయి బాధల్లో ఉన్న ప్రజలను పీల్చుకుతినే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనిసిఎం సూచించారు

# సాలూరులో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు పునఃప్రారంభం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సాలూరులో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం సాలూరు పట్టణంలో శరవేగంతో పునఃప్రారంభమౌతున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణన్ని మంత్రి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2019లో ఎమ్మెల్సీగా, టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంజూరు చేసిందన్నారు. 2019లో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. గిరిజన, పేద ప్రజల చిరకాల కల వంద పడకల ఆసుపత్రి నిర్మాణమని తెలిపారు.

ఎక్కువ పంచాయితీలు ఉన్న సాలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఆపద వస్తే సాలూరులో ముప్పై పడకల ఆసుపత్రి మాత్రమే ఉందని, అత్యవసర పరిస్థితులలో విజయనగరం, విశాఖపట్నం పెద్ద ఆసుపత్రులకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. మార్గమధ్యలో పేషెంట్లు మరణించారనే వార్త తెలిసినప్పుడు చాలా బాధగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు.



ముఖ్య మంత్రి స్పందిస్తూ తక్షణమే నాలుగు కోట్ల రూపాయల నిధులు ఆసుపత్రి నిర్మాణానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. వంద పడకల ఆసుపత్రి పనులను శరవేగంతో పునఃప్రారంభించడం జరిగిందని వివరించారు. రాబోయే మూడు నెలల్లో వంద పడకల ఆసుపత్రి పనులు పూర్తి చేసి సాలూరు ప్రజలకు అంకితమిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ముఖ్యమంత్రి పేద ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్యం సకాలంలో అందాలని నిరంతరం కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి సమైక్యంగా ఆసుపత్రి నిర్మాణంలో పాలుపంచుకోవాలని మంత్రి కోరారు.

నిండు ప్రాణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గర్భిణీ స్త్రీల కోసం బర్త్ వెయిటింగ్ హాల్ ను ఏర్పాటు చేసి, డెలివరీ అయ్యే వరకు ఆసుపత్రిలోనే ఉంచి, పౌష్టిక ఆహారం అందించి, డెలివరీ అయిన తరువాత అంబులెన్సులో ఇంటికి పంపించడం జరుగుతుందని తెలిపారు. పేదలకు వైద్యంపై భరోసా కల్పించాలని సూచించారు. అతి త్వరలోనే నాణ్యమైన, పూర్తి స్థాయిలో వైద్యానికి అవసరమైన పరికరాలతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేస్తామని, ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా సోలార్ పేనల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు.

అంతకముందు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. రూ.10.80 లక్షలతో నిర్మించిన గర్భిణీ స్త్రీల బర్త్ వెయిటింగ్ హాల్ ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పార్వతీపురం డిప్యూటీ డి. ఎమ్. హెచ్. ఓ డా.కె.వి.ఎస్ పద్మావతి,సాలూరు ప్రాంతీయ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎ.కె.రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిపోరు కారణంగా పార్టీని వీడిన మాజీ ఐఏఎస్ అధికారి

● అధికారిగా సమర్థుడే...కానీ అంతర్గత రాజకీయాల్లో నెట్టుకు రాలేకపోయారు
● విబేధాల పరిష్కారానికి ప్రయత్నించని వైసీపీ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీకి రాజీనామా చేసే నాయకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఎక్కువ మంది నేతలు కూటమి వేధింపులు భరించలేక బీజేపీ, జనసేనలో చేరుతున్నారు. మరి కొందరు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీని రాజకీయంగానే విమర్శలు చేశారు. వారెవరూ వ్యక్తిగతంగా టీడీపీ ముఖ్య నాయకులపై విమర్శలు చేయకపోవడంతో అటువంటి వారికి టీడీపీలో చేర్చుకుంటున్నారు. ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన అళ్ల నాని టీడీపీ నేతలనెవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయకపోవడంతో స్థానిక నేతలు వ్యతిరేకించినా ముఖ్యమంత్రి చంద్రబాబు అయన్ను చేర్చుకునేందుకు అంగీకరించారు. ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన నాయకులకు స్థానికంగా మద్దతు లేకపోవడం, వారి నుంచి సరైన సహకారం లేకపోవడంతో నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు నిర్వహించలేకపోతున్నారు. ఈ బాధలు పడలేక పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. వీరిలో మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ ఒకరు. రెండు రోజుల క్రితం పార్టీకి రాజీనామా చేయడంతోపాటు రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటాంచారు. వివరాలివి.

రాజకీయాలపై పెద్దగా అనుభవం లేదు. కుళ్లు రాజకీయాల గురించి అసలు తెలియదు. గెలిస్తే ప్రజాసేవ చేద్దామనుకున్నారు. కానీ ప్రజలు ఓడించారు. అయినా పరవాలేదు, పార్టీలో ఉంటూ ప్రజలకు చేరువ కావాలనుకున్నారు. అయితే సొంత పార్టీ వారి నుంచి కనీస సహకారం లేదు. దీంతో ఆరు నెలలుగా విసిగి పోయాడు. చేసేది లేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు షేక్ ఇంతియాజ్. తనకు రాజకీయాలపై పెద్దగా ఇష్టం లేదని, అందుకే రాజకీయాలకు దూరంగా ఉండాలనుకుంటున్నానని ఇంతియాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన వైఎస్సార్సీపీ అధ్యక్షునికి రాజీనామా లేఖ రాస్తూ తన వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికలకు ముందు..

మాజీ ఐఏఎస్ అధికారి షేక్ ఇంతియాజ్ 2024 ఎన్నికలకు ఒక నెల ముందు తన పదవికి రాజీనామా చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలువు మేరకు ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్సార్సీపీ కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ఆయనకు జగన్ అవకాశం కల్పించారు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన షేక్ హఫీజ్ ను కాదని ఇంతియాజ్ ను అభ్యర్థిగా పోటీకి దింపారు. అప్పటి వరకు పార్టీలో సీనియర్లుగా ఉన్న వారిని కాదని ఇంతియాజ్ కు టిక్కెట్ ఇవ్వడం ఇష్టంలేని వారు కూడా జగన్ చెప్పినందున ఆయన వెంట ఉంటూ వచ్చారు. ఎన్నికలు అయిపోగానే వైఎస్సార్సీపీలోనే ఇంతియాజ్ కు ఎదురుగాలి మొదలైది.

**సమర్థుడైన అధికారిగా...**

ఇంతియాజ్ సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే కృష్ణా జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు. ఈయన మామకు కర్నూలులో మంచి పేరు ఉంది. వైద్యుడిగా గుర్తింపు పొందటంతో ఆయన అభిమానులు ఇంతియాజ్ వెంట నడిచారు. కోవిడ్ సమయంలో ఇంతియాజ్ మామ చనిపోయారు. ఆయన భార్యకు కూడా కోవిడ్ వచ్చింది.

అయినా విధి నిర్వహణలోనూ, అలాగే కుటుంబ వ్యవహారాలను చూసుకోవడంలోనూ వెనుకడుగు వేయలేదు. పాలనలో చూపిన చొరవను చూసిన జగన్ ఆయన రాజకీయాల్లోకి వస్తే బాగుంటుందని భావించి ఉద్యోగానికి రాజీనామా చేయించి పార్టీలో చేర్చుకుని టిక్కెట్ ఇచ్చారు. అయితే ఇంతియాజ్ కు పార్టీ నేతల నుంచి కనీస సహకారం లేకుండా పోయింది.

**సొంత పార్టీ వారి సహకారం లేకే..**


సొంత పార్టీ వారి సహకారం ఇంతియాజ్ కు లేకుండా పోయింది. కర్నూలు



నగరంలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులు రావాలంటే మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఇంతియాజ్ తో కలిసి పనిచేయాలి. అయితే నగరంలోని ముఖ్య నాయకులైన మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, ఎస్ వి మోహన్ రెడ్డిల సహకారం పూర్తిగా లేకుండా పోయింది. దీంతో ఇంతియాజ్ పార్టీలో ఉండికూడా ఏమీ చేయలేని స్థితికి చేరుకున్నారు. కర్నూలు జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఉంటున్న బాలనాగిరెడ్డి నిత్యం కర్నూలులో ఉంటూ పార్టీని నడిపించే సత్తాలేదనేది కార్యకర్తల్లో ఉన్న వాదన. పైగా ఆయన మంత్రాలయం నుంచి కర్నూలుకు రోజూ వచ్చిపోవాలంటే ఇబ్బందిగానే ఉంటుందని అందువల్ల పార్టీ అధ్యక్షుడిని కూడా మార్చాలని కొందరు వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎస్వీ సుబ్బారెడ్డిలో నిలకడ లేకుండా పోయిందనే వాదన కూడా ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వైపు చూపులు ఉంటున్నాయని దాని వల్ల కూడా వైఎస్సార్సీపీకి నష్టం జరుగుతుందనే ప్రకారం వైఎస్సార్సీపీలో ఉంది.

# నాపై కక్షతో నా భార్య మీద అక్రమ కేసు

● పేర్ని నాని సంచలన ప్రకటన ● నా భార్యను అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు ● సోషల్ మీడియాలో తన భార్యపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు ● నా భార్య వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి



స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని సంచలన కామెంట్స్ చేశారు. తనపై, తన కుటుంబంపై జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. టీడీపీ సోషల్ మీడియా సెల్ తమపై తప్పుడు రాతలు రాస్తోందని పేర్ని నాని ఆరోపించారు. బియ్యం మిస్సింగ్ స్కామ్‌లో ఇరుక్కున్న పేర్ని నాని కుటుంబం.. పరారీలో ఉందంటూ గత కొద్ది రోజులుగా విపరీతమైన ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం మీడియా ముందుకు వచ్చిన ఆయన.. ఈ వ్యవహారంపై స్పందించారు. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తమ గోడౌన్‌లో బియ్యం తగ్గిందని అధికారులు చెప్పారని.. నైతిక బాధ్యత వహిస్తూ తన సతీమణి అధికారులకు ఒక లేఖ రాశారని గుర్తు చేశారు. టెక్నికల్‌గా తమ బాధ్యత లేకున్నా.. నైతికంగా బాధ్యత వహిస్తామని ఆ లేటర్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. అధికారులు తనిఖీలు చేసి 3,800 బస్తాలు తగ్గాయన్నారు. దాని తాలూకు వారి చెప్పినట్లుగా నగదు చెల్లించామని పేర్ని నాని వెల్లడించారు. అయినాసరే తమపై కక్ష కట్టి తన భార్య, గోడౌన్ ఇన్‌చార్జి మీద కేసు నమోదు చేశారన్నారు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు వెళ్తే రకరకాల కుట్రలు చేశారని పేర్ని నాని ఆరోపించారు. పదే పదే పీపీలను మార్చుతూ అడ్డంకులు సృష్టించారన్నారు. తనపై కక్షతో తన భార్య మీద అక్రమ కేసు పెట్టారని నాని ఆరోపించారు. తాము పారిపోయినట్లు అసత్య ప్రచారాలు చేశారన్నారు.

నేనేంటో డీపీజీకి తెలుసు..

తాను ఏంటో డీజీపీకి బాగా తెలుసునని పేర్ని నాని అన్నారు. తాను మంత్రిగా పని చేసినప్పుడు ఆయన తన శాఖలోనే పని చేసినట్లు పేర్కొన్నారు. అప్పుడు ఏదైనా తప్పుడు పని చేయమని ఆదేశించానా? అని నాని ప్రశ్నించారు. తనను, తన కుమారుడిని అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని నాని ఆరోపించారు. గోడౌన్ మేనేజర్‌ని అరెస్ట్ చేసి.. ఆయన ద్వారా తన పేరు చేర్చడానికి ప్లాన్ చేశారన్నారు. గోడౌన్ తలువులు పగులగొట్టి సరుకును తీసుకెళ్లారన్నారు. అందులోని సరుకు బాధ్యత మాది, సివిల్ సప్లై అధికారులది. కానీ, తమ ప్రమేయం లేకుండా సరుకును తరలించుకుపోయారు. తాను 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు బందరులోనే ఉన్నానని పేర్ని నాని చెప్పారు. లాయర్ల సూచన మేరకు విలేకరుల సమావేశం పెట్టడం లేదన్నారు.

తన భార్య గురించి యూట్యూబ్‌లో కొంతమంది దారుణమైన వ్యాఖ్యలు చేశారని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అడిగినట్లు డబ్బులు కట్టాక కూడా క్రిమినల్ కేసులు పెట్టారని విమర్శించారు. తన తల్లి మీద ప్రమాణం చేసి చెబుతున్నానని.. తాము ఏ తప్పుడు పని చేయలేదని మాజీ మంత్రి స్పష్టం చేశారు. త్వరలోనే వాస్తవాలు కూడా బయటకు వస్తాయన్నారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేయాలనుకుంటున్నారంటూ విపక్షాలపై నాని మండిపడ్డారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఏనాడూ తప్పుడు పని చేయలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా ఎవరూ ఇలాంటి తప్పుడు పని చేయరన్నారు.

3 శాతం లంచాలు తీసుకుని బిల్లులు తీసుకునేవారు కూడా తనపై ఆరోపణలు చేస్తున్నారంటూ విపక్ష నేతలపై మాజీ మంత్రి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా పని చేస్తూ తన శాఖలోని ఉద్యోగుల బదిలీలకు కూడా లంచాలు తీసుకున్న వారు తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమ గోడౌన్ మేనేజర్‌ని అరెస్ట్ చేయడానికి వారి మనుషుల్ని పోలీసులు కొడుతున్నారని పేర్ని నాని ఆరోపించారు. తనను, తన కుమారిడి అరెస్ట్ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. రాజకీయ కక్ష సాధించడానికి ఇంట్లోని మహిళల వరకు రావటం బాధ కలిగిస్తోందన్నారు. 30న బెయిల్ తీర్పు ఉన్నందున అన్ని విషయాల గురించి మాట్లాడటం లేదన్నారు. తనపై అధికార పార్టీ కక్ష కట్టిందన్నారు నాని.

## ప్రభుత్వాలు మారినా..

# విధానాలు మారలేదు

● భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు తగలబెట్టండి
● ఫిబ్రవరి 7, 10న విజయవాడ, కర్నూలులో ధర్నాలు
● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఆరు నెలలు గడిచినా విధానాలు మాత్రం మారలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా పునాది ఎలా పెంచుకోవాలి, ఎలా విస్తరించాలి, ఏయే అంశాలపై ఉద్యమించాలి అనే అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మూడు రోజులపాటు నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభలో విస్తృత కార్యాచరణపై చర్చిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను వైసిపి, టిడిపి, జనసేన పక్కనపెట్టి, వారి సొంత ప్రయోజనాలు, రాజకీయ ప్రయోజ నాలు చూసుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిం దన్నారు. ప్రభుత్వం మారినా ప్రజలు ఆశించిన మార్పు జరగలే దన్నారు. ప్రజానుకూల ప్రభుత్వం, అసమానతలు లేని అభివృద్ధి రావాలి అనే నినాదంతో రాష్ట్ర మహాసభలో ప్రధాన అజెండాగా చర్చిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలల్లో రూ.16 వేల కోట్ల అదనపు భారాన్ని మోపిందని, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నామని చెప్పకుండా దొడ్డిదారిన ట్రూ అప్ ఛార్జీల భారం వేసిందని విమర్శించారు. జనవరి నుంచి మళ్లీ 45 నుంచి 50 పైసలు మేర ఛార్జీలు పెంచబోతున్నారని తెలిపారు. విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో తగలబెట్టాలని పిలుపునిచ్చారు. విద్యుత్ రెగ్యులేటర్ కమిటీ నిర్ణయాలపై, ప్రజలపై భారాలు వేయడాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 7, 10 తేదీల్లో విజయవాడ, కర్నూలులో పెద్దఎత్తున ధర్నాలు చేపడతామని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు ఎందుకు పెంచారంటే గత ప్రభుత్వం పెంచిందని, తమ తప్పు లేదని టిడిపి కూటమి నేతలు చెప్పడం తగదని, గత ప్రభుత్వ విధానాలను సమీక్షించి మార్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై లేదా? అని ప్రశ్నించారు. రూ.500 కోట్లతో కొన్న సర్వే రాళ్లు రద్దు చేశారని, పాస్ పుస్తకాలు మార్చారని, విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలు ఎందుకు మార్చకుండా ఆమోదించారని ప్రశ్నించారు. వైసిపి విధానాలు అమలు పరుస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని గతంలో లోకేష్ చెప్పారని, నేడు మంత్రి అయ్యాక వాటిని బిగించాలని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అదానితో విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## గంజాయి కేసుల్లో కూడా పెరుగుదల

# తగ్గిన సాధారణ క్రైమ్‌లు

**మీడియాకు వివరాలు తెలిపిన డిజిపి ద్వారకా తిరుమల రావు**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ఈ ఏడాది సైబర్ క్రైమ్ 34 శాతం పెరిగాయ్ని, అలాగే గంజా కేసులు 3 శాతం పెరుగుద్ల ఉంద్ని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు పేర్కొన్నారు. ఎపిలో ఈ ఏడాదిలో మొత్తం 92,094 క్రైం కేసులు రిపోర్ట్ అయ్యాయన్నారు. విజ్యాడ డిజిపి కార్యాలయంలో నేడు ఈ ఏడాది క్రైం రిపోర్ట్ ను విడుద్ల చేశారు.. గ్త సంవ్త్సంతో పోలిస్తే . ఓవరాల్ క్రైం రేటు 5.2 శాతం తగ్గిందన్నారు. ఇక, దొంగతనం, దోపిడీ కేసులు 0.2 శాతం పెరిగాయ్ని, .. మహిళల పట్ల జరిగిన క్రైంలు 10 శాతం తగ్గాయని చెప్పారు.. ఇక . మహిళల హత్యలు 20 శాతం పెరిగాయ్ని విర్వించారు. ఎస్సీ, ఎస్టీల పట్ల నేరాలు కూడా 4.9 శాతం తగ్గాయని డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. డిజిట్ల్ అరెస్ట్ ఉండ్వు మన దేశంలో డిజిటల్ అరెస్ట్ అనేదే లేదు అని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పుకొచ్చారు. ప్రతీ జిల్లాకి ఒక సైబర్ క్రైం పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయడానికి సీఎం నిర్ణయించార్నారు.. బ్యాంకర్లు కూడా అధిక మొత్తంలోని లావాదేవీల విషయంలో కస్టమర్లతో మాట్లాడితే పెద్ద నేరాలు జరగకుండా ఆపొచ్చని సూచించారు.ఇక, 10, 837 ఎకరాల్లో గంజాయికి మారు పంటలు కూడా వేయించామ్ని తెలిపారు అలాగే, డ్రోన్లు వినియోగంలో ఆధునికతను పెంచుతున్నామ్ని చెప్పారు. . 173 డ్రోన్లను వినియోగిస్తున్నామ్ని, .. మనిషి వెళ్ళలేని చోట డ్రోన్లు వాడుతున్నామని వెల్లడించారు. కార్తీక మాసంలో డ్రోన్ల వల్లే బాపట్లలో ముగ్గురిని కాపాడామ్ని చెప్పారు.

# హైందవ సంఖారావం బహిరంగ సభకు హాజరుకండి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జనవరి 5 వ తేదీ విజయవాడ లోని హైందవ శంఖరావం బహిరంగ సభ జరుగుతుందని తమరు హాజరు కావాలని కళ్యాణదుర్గం శాసన సభ్యులు శ్రీ అమిలినేని సురేంద్ర బాబు గారిని విశ్వ హిందూ పరిషత్ వారు ఆహ్వానం పలికారు. అందులో భాగంగా విజయవాడ కు భహిరంగ సభకు రావడానికి బస్సులు ఏర్పాటు చేయాలనీ విన్నవించారు. వారి వినతి మేరకు రెండు బస్సులను మా నియోజకవర్గం నుండి సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే సహాయం చేసారని విశ్వ హిందూ పరిషత్ వారు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ వై పి రమేష్ విభాగ్ కార్యవాహ జగదీష్, విహెచ్పి జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, బిజెపి మాజీ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యకారిని నరహరి, ఆర్ఎస్ఎస్ భౌతిక్ ప్రముఖ వీరేంద్ర, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# స్కేటర్ జెస్సీరాజుకు శాప్ ఛైర్మన్ అభినందన



విజయవాడ: స్కేటింగ్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గౌరవ రాష్ట్రపతి శ్రీ ద్రౌపది ముర్మ గారి చేతుల మీదుగా ప్రధానమంత్రి బాలపురస్కార్-2025 అవార్డు అందుకున్న స్కేటర్ జెస్సీరాజ్ తన తల్లిదండ్రులతో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడు గారిని ఈరోజు విజయవాడలోని శాప్ కార్యాలయంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె అందుకున్న అవార్డును, ప్రశంసాపత్రాలను రవినాయుడు గారికి చూపించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ గారు జెస్సీరాజ్ను అభినందిస్తూ సత్కరించడం జరిగింది. ఏపీ క్రీడాకారిణికి ప్రధానమంత్రి బాలపురస్కార్ అవార్డు రావడం గర్వించదగ్గ విషయమని, క్రీడాకారిణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిసహకారం ఉంటుందని, సీఎం శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి దృష్టిలో కూడా పెట్టడం జరిగిందని జెస్సీరాజ్ తల్లిదండ్రులకు శాప్ ఛైర్మన్ గారు హామీ ఇవ్వడం జరిగింది.

**క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డికి అభినందనలు..**

మెల్బోర్న్లో ఆస్ట్రేలియాపై జరిగిన బాక్సింగ్ డే టెస్టులో వైజాగ్ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి తన తొలి మ్యాచ్లోనే అంతర్జాతీయ సెంచరీని సాధించడం అత్యద్భుతం. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆసీస్పై అద్భుతమైన తొలి సెంచరీని చేయడం అతని పట్టుదల, కృషి, అంకితభావానికి నిదర్శనం. తొలి మ్యాచ్లోనే సెంచరీతో మోతమోగించిన నితీష్ ప్రదర్శన ఆంధ్రప్రదేశ్తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా గర్వించదగ్గ పరిణామం. ఈ సందర్భంగా నితీష్కు శాప్ తరువున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో నితీష్ మరింత ఉన్నతంగా రాణించాలి. అంతర్జాతీయ క్రికెట్లో అద్భుతమైన రికార్డులను తన ఖాతాలో వేసుకోవాలని కోరుతున్నాను.

ప్రపంచ జనాభా 2024కు వీడ్కోలు పలుకుతూ రానున్న 2025లోకి కోటి ఆశలతో ప్రవేశిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపడానికి ఎదురు చూస్తున్నది. ఐక్యరాజ్యసమితి 80వ వ్యవస్థాపక సంవత్సరం–2025లోకి అడుగిడుతున్న సంధికాలం లో ఉన్న ప్రపంచ మానవాళిని పలు ప్రమాదకర విపత్తులు, సంక్షోభాలు వేధించను న్నాయని ఊహించడమే అతి కష్టంగా కనిపిస్తున్నది. 2025 ఏడాదిలో కోప్–30 సద స్సుకు బ్రెజిల్ ముస్తాబు అవుతున్నది. మరో వైపు ఉక్రెయిన్– రష్యా, ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధాలతో పాటు సిరియా, సుడాన్ సంక్షోభాలు ప్రపంచ జనాభాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ 2025లోనైనా కాల్పుల విరమణలతో చక్కటి పరిష్కారాలు దొరకాలని ఆశ పడుతున్నది. సుస్థిరాభివృద్ధికి అవసర పెట్టుబడులు, వాతావరణ ప్రతికూల మార్పుల సాధికారత చర్చల వేదికగా కోప్–30 సదస్సు ఏర్పాట్లు, లింగ సమానత్వ సమస్యలను చర్చించే 4వ ప్రపంచ మహిళా సదస్సుకు 2025 నాటికి మూడు దశాబ్దాలు పూర్తి కావడం, రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడిన ఐరాసకు 80 ఏండ్లు పూర్తి కావడం 2025 ఏడాది ప్రత్యేకతగా పేర్కొన వచ్చును.

అత్యంత ప్రమాదకర మానవ హక్కుల హననాలను పరిచయం చేస్తున్న యుద్ధాలతో గాజాపై ఇజ్రాయిల్ మూకుమ్మడి దాడి, ఉక్రెయిన్పై రష్యా విరుచుకు పడడంతో పాటు సూడాన్, సిరియా లాంటి దేశాల్లో హృదయవిదారక దుస్థితులు నెలకొని ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో 6.2 మిలియన్లు, గాజా దాడుల్లో 1.4 మిలియన్ల మహిళలు/ పిల్లలు/ వృద్ధులు శరణార్థులుగా మారడం చూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 110

## 2025లో మానవాళిని కలవరపెట్టే సమస్యలు !

మిలియన్ల బల వంతపు మానవ వలసలు జరిగాయి. శరణార్థుల్లో 50 శాతం వరకు ఉక్రెయిన్, సిరియా, అఫ్ఘానిస్థాన్ అభాగ్యుల ఉన్నట్లు తేలింది. ఈ ప్రాంతాల్లో మానవాళి, ముఖ్యంగా పిల్లలు, మహిళలు అత్యంత దయనీయ పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని కొన ఊపిరితో బతుకులు ఈడుస్తున్నారు. ఈ సంక్షోభాలతో ప్రపంచ జనాభా గత కొన్ని ఏండ్లు/మాసాలుగా ప్రభావితం కావడం, చమురు/ఆహార ధాన్యాలు/వంట నూనెల ధరలు చుక్కల్లోకి చేరడం గమనిస్తున్నాం. కనీసం 2025లోనైనా ఈ యుద్ధాలు, సంక్షోభాలకు సమాధానాలు దొరికి, ప్రభావిత జనాభా తిరిగి పూర్వపు స్థితికి చేరాలని కోరుకుంటు న్నాం. సిరియాలో ఇటీవల అరాచక పాలన అంతం కావడంతో సత్వరమే ఆ దేశంలో న్యాయం, పునర్నిర్మాణం, వ్యక్తిగత స్వేచ్ఛ, సమాన అవకాశాల కల్పన జరగాలని ఎదురు చూస్తున్నాం. 2024లో హైతీ, మయన్మార్, యెమన్లలో ఏర్పడిన అస్థిరత్వానికి అంతర్జాతీయ చొరవతో పాటు 2025 చక్కటి పరిష్కారాలు చూపాలి.

వాతావరణ ప్రతికూల మార్పుల కట్టడికి సంబంధించిన కోప్–30 సదస్సును 2025లో బ్రెజిల్, బేలెమ్లో నిర్వహించనున్న వేళ ప్రపంచ మానవాళి వేయి కళ్లతో ఎదురు చూస్తు న్నది. కార్బన్ ఉద్గారాల కట్టడి, హరిత గృహ వాయువులను తగ్గించడం, భూతాపాన్ని పరిమితుల్లో అదుపు చేయడం,పర్యావరణ హిత వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, ప్యారిస్ ఒప్పందం ప్రకారం భూతాపాన్ని 1.5 డిగ్రీల లోపు కట్టడి చేయడం, అత్యధిక కార్బన్ ఉద్గారకాలకు కారణమైన దేశాలపై అదుపు బాధ్యతలను పెంచడం, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గిస్తూ విద్యుత్ వాహనాలను ఉపయోగానికి ప్రాధాన్యం ఇవ్వడం లాంటి అంశాల అమలుకు 2025 వేదిక కావాలి. కలుషిత నీటితో 2.1 బిలియన్ల పేదలు బతుకులు ఈడుస్తున్నట్లు తేలింది.

పురుషులతో సమానంగా మహిళలు, బాలికలకు ఉచిత నిర్బంధ విద్య, మాతాశిశు బాలికల ఆరోగ్య సంరక్షణ చర్యలు, మహిళలు/బాలికల కదలికలకు సమాన స్వేచ్ఛ ఇవ్వడం, బాలికలను కార్మికులుగా మార్చడాన్ని నిరోధించడం, బాలికలు/మహిళల అక్రమ రవాణాతో పాటు వేశ్య వృత్తిలోకి నెట్టడం, ఉద్యోగ ఉపాధుల్లో లింగ సమానత్వ వేతనాలు చెల్లించడం, మహిళలకు నిర్ణయాధికారాలు ఇవ్వడం, వంటింటి కుందేలును బయటకు రప్పించడం, మహిళా లోకానికి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం లాంటి ప్రధాన అంశాల్లో చొరవ చూపడానికి 2025 వేదిక కావాలి.

రెండవ ప్రపంచ యుద్ధం నేర్పిన గుణపాఠాల నేపథ్యంలో 1945లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేయడం చూసాం. నాటి నుంచి నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా అనేక వాంఛనీయ, అవాంఛనీయ మార్పులు చోటు చేసుకున్నాయి. నేటి ప్రపంచ మానవాళి అవసరాలకు అనుగుణంగా ఐరాస తన పంథాను మార్చుకొని ప్రపంచ శాంతికి బాటలు వేయడానికి 2025లో నాంది పలకాలి. ఇప్పటి వరకు ఐరాస పాత్ర చాలా పరిమితంగానే ఉందని, రానున్న రోజుల్లో అయినా సకారాత్మక మార్పుల దిశగా తన పాత్రను నిర్వహించాల్సి ఉంది. నేడు జరుగుతున్న రెండు భీకర యుద్ధాలను అదుపు చేయడం, పలు దేశాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన కట్టడి చేయడం లాంటివని తక్షణావసరాలుగా ఐరాస భావించి ముందడుగులు వేయాలి.

మనిషి స్థానాన్ని రోబోలు ఆక్రమించనున్నాయి. సాంప్రదాయ జీవనశైలి, వర్తక వ్యాపారాలను రానున్న రోజుల్లో కృత్రిమ మేధ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎంతో ప్రభావితం చేయనున్నది. పనిలో వేగం పెరగడానికి ఏఐ సాంకేతికలను సన్మార్గంలో వినియోగించాల్సి ఉన్నది. నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో శాస్త్ర సాంకేతిక ఆయుధాలను దుర్వినియోగం చేస్తే మానవాళికి ఎంతో నష్టం వాటిల్లనున్నది. నేటి యుగంలో ఏఐ అనువర్తనాలు లేని రంగం లేదు. పొద్దున లేవగానే పళ్లు తోసుకోవడం నుంచి హుమనాయిడ్ రోబోటిక్స్తో ఇంటి పనులు చేయించే వరకు ఏఐ తన పనితనాన్ని చూపుతున్నది. మనిషి చేస్తున్న ప్రతి పనిని ఏఐ చేయడానికి సిద్ధం అయ్యింది. అమెజాన్ కంపెనీ ఇప్పటికే 7.5 లక్షల రోబోలనా వివిధ పనులకు పురికొల్పడం జరిగిందనే విషయం తెలుసుకోవాలి. కొరియా ప్రాంతం వేడెక్కడం, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడం, దక్షణ చైనా సముద్రంలో పరిణామాలు, మిడిల్ ఈస్ట్లో చెలరేగుతున్న సంక్షోభాలలతో పాటు గత కొన్నేళ్లుగా మానవాళినా వెంటాజుతున్న పేదరికం, ఆకలి చావులు, ప్రజారోగ్య పరిరక్షణ, నీటి కాలుష్యం, నగరాల్లో గాలి కాలుష్యం, నేల ఎడారీకరణ, మానవ హక్కుల హననాలు, జీవ వైవిధ్య విధ్వంసాలు, అణ్వాయుధాల ప్రయోగాలు, దివ్యాంగుల సమస్యలు, ఆర్థిక అసమానతలు, అవిద్య, నిరుద్యోగం, హింస, విపత్తుల దాడి, మానవ వలసలు, బాలల హక్కులు, అవినీతి చెదలు, ఇస్లామిక్ తీవ్రవాదం లేదా ఉగ్రవాదం, వేర్పాటువాదం, సైబర్ నేరాల విష వలయాలు, అంటువ్యాధుల దాడి, కోవిడ్–19 లాంటి మహమ్మారుల ఆగమనాలు లాంటివి 2025లో తమ తీవ్ర ప్రతాపాన్ని చూపకముందే విశ్వ మానవాళి మేల్కొని, తమ కర్తవ్యాలను తెలుసుకొని, తమ సుస్థిర భవితను తామే రచించుకోవాలి. 2025 ఏడాదిని రానున్న చరిత్రలో గుర్తుంచుకునే విధంగా ప్రతి ఒక్కరి సాధికారత దిశగా పటిష్ట అడుగులు పడాలి. ఊహించిన సమస్యలతో పాటు ఊహించని విపత్తులు ఎప్పుడైనా, ఎక్కడైనా రావచ్చుని, అప్రమత్తతతో ఉంటూ మానవ శ్రేయస్సుకు పునాదులు వేయాలి.

**గుడ్ బై ఓల్డ్ ఇయర్ 2024 బీ వెల్కమ్ టు న్యూ ఇయర్ 2025.**

# పదవికే వన్నె తెచ్చిన ఆర్థిక మార్గదర్శి

- మన్మోహన్ జీవిత చరిత్ర ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తి దాయకం
- వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారుగా ప్రస్తానం
- భారతదేశ అంతర్గత దృష్టికోణంలో ఆయన వాణిజ్య విధానం
- స్వతంత్ర ఆర్థిక చరిత్రలో కీలకమైన మలుపు ఆర్థిక మంత్రిగా పనిచేసిన కాలం
- పది ఏళ్ళ పాలనలో ప్రగతి పథంలో ముందుకు దేశం



**కామిడి సతీష్ రెడ్డి**
**9848445134.**

సింగ్ మరణం తో దేశ వ్యాప్తంగా అందరూ శోక సంద్రంలో మునిగిపోయారు.దేశ వ్యాప్తంగా ఏడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది.తెలంగాణ రాష్ట్రం లో విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది.వారి జీవిత చరిత్ర ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తి దాయకం. మన దేశం గొప్ప పరిపాలనా ద్రక్షుడును కోల్పోయింది.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం తో దేశం గొప్ప రాజకీయ నాయకుడిని కోల్పోయింది.సాధారణ కుటుంబం లో జన్మించి గొప్ప ఆర్థిక వేత్తగా ఎదగడం దేశ ప్రజల జీవితాలను పెరుగు పరచడం వారికే సాధ్యం అయింది.దూర దృష్టి గల రాజనీతిజ్ఞుడు గా దేశంలో పేదరికం తగ్గించడానికి శాయశక్తులా కృషి చేశారు.వారి జీవితం ఎందరికో స్ఫూర్తి.భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 1932 సెప్టెంబర్ 26న అవిభాజిత భారతదేశ పంజాబ్ ప్రావిన్స్ లో జన్మించారు.వారింతల్లి దండ్రులు గురు ముఖ్ సింగ్,అమృత్ కౌర్.చిన్న తనం లో తల్లి మరణించింది. తన అమ్మమ్మ జామ్నా.దేవి వద్ద పెరిగారు. చిన్నప్పుడు వారిని అందరూ మోహనా అని పిలిచేవారు. ప్రతీ రోజూ పది కిలో మీటర్లు నడుచు కుంటూ వెళ్లి చదువుకున్నాడు.ఉర్దూ భాష లోనే చదువుకున్నారు.దేశ విభజన సమయంలో వారి కుటుంబం పాక్ నుండి ఉత్తరా ఖండ్ లోని హాఫ్వాని నగరం కు వచ్చారు.తర్వాత 1948 లో అమృత్ సర్ వెళ్లి స్థిర పడ్డారు.డాక్టర్ సింగ్ 1948లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి మ్యాట్రిక్యులేషన్ పరీక్షలు పూర్తి చేశారు. ఆయన విద్యా ప్రయాణం పంజాబ్ నుంచి యూకేలోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో 1957లో ఆర్థికశాస్త్రంలో ఫస్ట్ క్లాస్ హానర్స్ డిగ్రీ పొందడం వరకు సాగింది. ఆ తర్వాత డాక్టర్ సింగ్ తర్వాత ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ నుండి 1962లో ఆర్థికశాస్త్రంలో డి.ఫిల్ పొందారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అనేక గొప్ప రచనలు చేశారు. ఆయన రచించిన "ఇండియాస్ ఎగ్పార్ట్ ట్రెండ్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ సెల్ఫ్–స్టెయిన్డ్ గ్రోత్" (క్లారెండన్ ప్రెస్, ఆక్స్ఫర్డ్, 1964) అనే పుస్తకం భారతదేశ అంతర్గత దృష్టికోణంలోని వాణిజ్య విధానంపై ఒక ప్రారంభ విమర్శగా గుర్తించబడింది. తన అకాడమిక్ జీవితం పంజాబ్ యూనివర్సిటీ, ప్రతిష్టాత్మక ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్లో పని చేసిన సంవత్సరాలతో మరింత పటిష్టంగా తన ఆర్థిక నైపుణ్యలను పెంచుకున్నారు. 1987 నుండి 1990 వరకు ఆయన జెనీవాలోని సౌత్ కమిషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. 1971లో డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత ప్రభుత్వంలో వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారుగా చేరారు.తరువాత 1972లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, ఆర్థిక మంత్రిత్వ శాఖలో కార్యదర్శి, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు, భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్, ప్రధాన మంత్రికి సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్గా కూడా పనిచేశారు.1991 నుండి 1996 వరకు డాక్టర్ సింగ్ భారత దేశ ఆర్థిక మంత్రిగా పనిచేసిన కాలం భారతదేశపు స్వతంత్ర ఆర్థిక చరిత్రలో ఒక కీలకమైన మలుపుగా మారింది.

ఆ కాలంలో ఆర్థిక సంస్కరణల విధానాన్ని ప్రారంభించిన ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ నిరాడంబర జీవితం గడుపుతున్నారు. ఆయన ప్రజా సేవా జీవితంలో పొందిన అనేక పురస్కారాలు, గౌరవాలు ఉన్నాయి. అందులో ప్రముఖమైనవి భారతదేశపు రెండవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ విభూషణ్ (1987), జవహర్లాల్ నెహ్రూ జయంతి శతాబ్ది పురస్కారం (1995), ఆసియా మనీ అవార్డు ఫర్ ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ది ఇయర్ (1993–1994), యూరో మనీ అవార్డు ఫర్ ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ది ఇయర్ (1993), యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ యొక్క ఆడమ్ స్మిత్ ప్రైజ్ (1956), సెంట్రల్ లండన్ లోని సెంట్ జాన్ కాలేజ్ ద్వారా ప్రదర్శనలో ప్రఖ్యాతి చెందిన రైట్ ప్రైజ్ (1955) ఉన్నాయి.

అలాగే, పలు దేశాలు అత్యున్నత పురస్కారాలు కూడా అందుకున్నారు.డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సమావేశాలలో, అంతర్జాతీయ సంస్థలలో భారతదేశాన్ని ప్రాతినిధ్యం వహించారు.1993లో అంగీకరించిన కామన్వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్న్మెంట్ మీటింగ్ (సైప్రస్), 1993లో వియన్నాలో జరిగిన ప్రపంచ హ్యూమన్ రైట్స్ కాన్ఫరెన్స్కు ఆయన నాయకత్వం వహించారు.పొలిటికల్ కెరీర్ లో డాక్టర్ మన్మోహన్ సింగ్ 1991 నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 1998 నుండి 2004 వరకు ఆయన రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2004 జనవరి ఎన్నికల తరువాత డాక్టర్ మన్మోహన్ సింగ్ 22 మే 2004న ప్రధాని పదవిని స్వీకరించారు. 2009 మే 22న రెండవసారి ప్రమాణం చేశారు.2007లో అధికంగా తొమ్మిది శాతం వృద్ధి రేటు పెరిగింది వీరి హయాం లో జాతీయ ఉపాధి హామీ చట్టం,సమాచార హక్కు చట్టం దేశ చరిత్ర లోనే కొత్త ఒరవడి సృష్టించింది.అలాగే విద్యా హక్కు చట్టం అమలు లోకి వచ్చింది. పది ఏళ్ళ మన దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపారు. వారి సేవలు దేశ చరిత్రలో స్వర్ణ యుగం లాంటివి.ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం ప్రజల మనో బావాలను అర్థం చేసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వారు సంపూర్ణ మద్దతు ఇవ్వడం మరచి పోలేని విషయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారు భౌతికంగా లేకున్నా యావత్తు భారతీయుల హృదయాలలో వారి సేవలు చిరస్థాయిగా నిలిచి పోయి వుంటాయి.

# సూడాన్ దేశంలో హడలెస్తున్న కరువు

- ఐపిసి కరువు సమీక్షా కమిటీ తాజా నివేదిక తో ఆందోళనకరం
- జనం ఆరోగ్యం, జీవనోపాధి, సామాజిక నిర్మాణాలకే తీవ్రంగా విచ్ఛిన్నం
- పొలాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని రైతుల ఆవేన
- మరికొందరు పంటలను కొల్లగొట్టారని - నాశనం చేసారన్న దిగాలు
- ఇద్దరి వ్యక్తుల మధ్య ఆధిపత్య పోరు తోనే ఇబ్బందులు



**జనక మోహన రావు దుంగ**
**8247045230**

సూడాన్ ఇటీవలి చరిత్రలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆకలి సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది.సుదీర్ఘమైన కరువుతో అల్లాడుతుంది. మానవతా సహాయం లేకుంటే వందల, వేల మంది ఆకలితో మరణించవచ్చు. ముగ్గురు పిల్లలలో ఒకారు తీవ్రమైన పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారు. "కరువు మానవ బాధ యొక్క అత్యంత తీవ్రమైన వ్యక్తీకరణ. ఇది మనుగడకు అవసరమైన వ్యవస్థలు, వనరుల వినాశకరమైన పతనాన్ని సూచిస్తుంది" అని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) తాజా నివేదిక పేర్కొంది. ఐపిసి కరువు సమీక్షా కమిటీ తాజా నివేదిక సూడాన్ లో కనీసం ఐదు ప్రదేశాలలో కరువు పరిస్థితులు ఉన్నాయని సూచిస్తున్నాయి. వీటిలో ఉత్తర డార్ఫూర్ లోని స్థానభ్రంశం శిబిరాలు, దక్షిణ కోర్డోఫాన్ లోని పశ్చిమ నుబా పర్వతాలు ఉన్నాయి. రాబోయే నెలల్లో మరో ఐదు ప్రాంతాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని గుర్తించారు. ఇది కేవలం ఆహారం లేకపోవడం మాత్రమే కాదు, ఆరోగ్యం, జీవనోపాధి, సామాజిక నిర్మాణాలను తీవ్రంగా విచ్ఛిన్నం చేస్తుంది. మొత్తం సమాజాలను నిరాశా నిస్పృహలో ఉ ంచుతుంది. భద్రతా పరిస్థితులు అనుమతించిన ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం వ్యవసాయానికి మద్దతు ఇచ్చినప్పటికీ, కొనసాగుతున్న సంఘర్షణ వ్యవసాయ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించింది. రైతులు పొలాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని, పంటలను కొల్లగొట్టారని లేదా నాశనం చేశారని నివేదిక తెలిపింది. నిర్వాసిత కుటుంబాలు, ముఖ్యంగా జనావాసాలు, ప్రభుత్వ భవనాలలో ఉన్నవారు పంట యొక్క ప్రయోజనాలకు దూరంగా ఉన్నారు.

**క్షీణిస్తున్న ఆహార భద్రత:** ఐపిసి ఫేజ్ 4 (ఎమర్జెన్సీ) లో 81 లక్షల మంది, ఫేజ్ 5 (విపత్తు) లో 6,38,000 మంది ఉన్నారు. ఫేజ్ 3 (సంక్షోభం) లో 1.59 కోట్లకు పెరిగింది. ఐపిసి ఫేజ్ 3 క్లిష్టమైన ఆహార అంతరాలు లేదా సంక్షోభ వ్యూహాలపై ఆధారపడటం ద్వారా గుర్తించబడుతుంది. ఫేజ్ 4 తీవ్రమైన పోషకాహార లోపం లేదా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనే స్థితిని కలిగి ఉంటుంది. ఫేజ్ 5 ఆకలి, మరణంతో పాటు తీవ్రమైన పోషకాహార లోపంతో కరువును సూచిస్తుంది. ఐపీసీ ప్రకారం దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఆహారం, పౌష్టికాహారం అందుబాటులో క్షీణిస్తుండటంతో సూడాన్ లో ఆహార భద్రత పరిస్థితి వేగంగా క్షీణించడంపై సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తం చేశారు.

**దీనికి కారణం:** సూడాన్ దేశంలో ప్రస్తుత పరిస్థితికి కారణం అధికారం, పలుకుబడి కోసం ఇద్దరి వ్యక్తుల మధ్య ఆధిపత్య పోరు. వీరిలో ఒకరు సుడనీస్ మిలటరీ అధిపతి జనరల్ అబ్దెల్ ఫత్తా బుర్హాన్ కాగా మరొకరు ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్కు అధిపతిగా ఉన్న మహ్మద్ హమ్దాన్ దగాల. ఈ ఆధిపత్య పోరు ఏప్రిల్ 2023లో పెద్ద ఎత్తున సంఘర్షణగా మారి సూడాన్ పౌరులు తీవ్ర కరువు కోరల్లో చిక్కడానికి కారణమయింది. క్రూరమైన సంఘర్షణ కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి పారిపోయేలా చేసింది. జూన్ 2024 నాటికి స్థానభ్రంశం చెందిన వారి సంఖ్య దాదాపు 1.2 కోట్లకు చేరుకుంది. ఈ సంఘర్షణ ఈ పరిస్థితులను మరింత తీవ్రతరం చేసింది. దాదాపు వీరి సంఖ్య సూడాన్ జనాభాలో (2.50 కోట్ల ) సగానికి పైగా అవసరంలో ఉన్నారు. ఈ సంఘర్షణలో కనీసం 15,500 మంది మరణించారని అంతర్జాతీయ నివేదికలు తెలుపుతున్నాయి. గత ఇరవై నెలల నుండి జరుగుతున్న విధ్వంసకర సంఘర్షణ, పెరుగుతున్న ప్రజల స్థానభ్రంశం, నిధులలో అంతరాయంతో పాటు మానవతా సహాయం అందుబాటుపై వీరి తీవ్రమైన ఆంక్షలు మూలంగా సూడాన్లోని పంట ఉ త్పత్తి ప్రాంతాలైన డార్ఫర్, కోర్డోఫాన్, ఖార్టూమ్, అల్జజీరా ప్రాంతాలలో అత్యంత ఘోరమైన కరువు తాండవిస్తుంది. వ్యాపార మార్కెట్లు, మానవతా సహాయ గిడ్డంగులను దోపిడీ చేయడం ఆహార కొరతకు మరింత దోహదం చేసింది. సంఘర్షణ మూలంగా సూడాన్లో ఆకలితో అలమటిస్తున్న వారి సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. ఊహా తీతమైన నిష్పత్తిలో ఆకలి సంక్షోభం ఉంది. సూడాన్ తీవ్ర స్థాయిలో ఆహార అభద్రతను ఎదుర్కొంటోంది. ప్రతిరోజూ లక్షలాది ప్రజలు తమ కుటుంబాలను పోషించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది ప్రజలకు తగినంత ఆహారం అందుబాటులో లేదు. వ్యవసాయోత్పత్తిపై ప్రభావం చూపుతోంది. వేలాది మంది రైతులు మరణిస్తున్నారు. ఆహార వ్యవస్థలు దిగజారాయి.ఆహార మార్కెట్లు ఖాళీగా ఉంటున్నాయి. అధిక ఆహార ధరలు, తక్కువ కొనుగోలు శక్తి మానవతా అవసరాలను పెంచుతున్నాయి. పంటలు పండించగల ప్రజల సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఇంధన ధర పెరుగుతోంది. దక్షిణ సూడాన్లో అవసరాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజల ఆదాయాలపై ప్రభావం చూపింది. సుడాన్ "బ్రెడ్బాస్కెట్", అల్ జాజిరా రాష్ట్రానికి సంఘర్షణ విస్తరించడం వలన ఐదు లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు.

**సంక్షోభంలో సూడాన్ అగ్రస్థానం:** ప్రతి సంవత్సరం ప్రపంచ మానవతా సంక్షోభాల అవకాశాల్ని విశ్లేషించే అంతర్జాతీయ రెస్క్యూ కమిటీ " "ఎమర్జెన్సీ వాచ్ లిస్టు"లో సూడాన్ మొదటి స్థానంలో ఉంది. సూడాన్లో పెరుగుతున్న సంఘర్షణ, సామూహిక స్థానభ్రంశం, ఆర్థిక సంక్షోభం, ఆరోగ్య సంరక్షణ సేవల పతనం కారణంగా సూడాన్ అగ్రస్థానంలో నిలవడానికి కారణాలుగా ఉన్నాయి.

**ప్రస్తుత పరిస్థితి:** ఈ సంఘర్షణసూడాన్ జనాభాలో దాదాపు పావు వంతు అంటే సుమారు 1.2 కోట్లకు పైగా ప్రజలను వారి ఇళ్ల నుండి తరిమి వేసింది. సూడాన్ సంఘర్షణకు ముందే దీర్ఘకాలిక రాజకీయ అస్థిరత, ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా 1.58 కోట్ల మందికి మానవతా సహాయం అవసరమైంది. విపరీతమైన వాతావరణ షాక్లు, సామాజిక, రాజకీయ అశాంతి, పేదరికం, ఆకలి, పెరుగుతున్న ఆహార ధరల కారణంగా సుడాన్ ఇప్పటికే మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ఇది ఆహార అభద్రతను మరింత తీవ్రతరం చేసింది. అంతర్జాతీయ మానవతా చట్టాలను కూడా దేశ నలుమూలల విస్మరిస్తూ జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భీకర పోరు కొనసాగిస్తున్నారు. పౌరులు అధిక సంఖ్యలో మరణించారు. అనేక మంది గాయపడ్డారు. లైంగిక హింస విపరీతంగా ఉంది. ఆరోగ్య సంరక్షణ, విద్యా సౌకర్యాలతో సహా అవసరమైన మౌలిక సదుపాయాలు శిథిలావస్థలో ఉన్నాయి. పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం సహా అత్యవసర సేవలు నిలిచిపోయిన నేపథ్యంలో కలరా వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.

**ఆందోళన వ్యక్తం చేసిన యుఎన్:** శరవేగంగా దిగజారుతున్న పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ " యుయన్ దాని భాగస్వాములు ఆహార సహాయం, ఇతర అవసరమైన మద్దతు కార్యక్రమాలను పెంచుతున్నారని" పేర్కొన్నారు. "కొనసాగుతున్న పోరాటం, సహాయక సామాగ్రి, సిబ్బంది కదలికలపై ఆంక్షలు కొనసాగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని" ఆయన ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. "మానవతా సహాయం, సిబ్బంది అవసరమైన చోటకు చేరుకోవడానికి వేగవంతమైన, సురక్షితమైన, ఆటంకం లేని స్థిరమైన ప్రాప్యతను సులభతరం చేయాలని సెక్రటరీ జనరల్ పార్టీలకు తన పిలుపును పునరుద్ఘాటించారు"

**తక్షణమే యుద్ధ విరమణ అవసరం:** 2025లో సూడాన్ సంక్షోభం, పొరుగు దేశాలపై దాని ప్రభావం మరింత పెరగకుండా నిరోధించడానికి, ప్రాణాలను కాపాడటానికి శత్రుత్వాన్ని తక్షణమే నిలిపివేయాల్సిన అవసరాన్ని గుటెరస్ నొక్కి చెప్పారు. శాశ్వత కాల్పుల విరమణ ద్వారా వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించడానికి పార్టీలను దగ్గర చేయడా నికి, మానవతా చర్యలకు నిధులను పెంచడానికి తక్షణ అంతర్జాతీయ మద్దతు, సహకారాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే యుద్ధ విరమణ చేస్తేనే సంక్షోభం తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చుని ఐపీసీ నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా సంఘర్షణ ప్రాంతాలలో సురక్షితమైన, అంతరాయం లేని స్థిరమైన మానవతా ప్రాప్యతను పునరుద్ధరించాలని, బహుళ రంగాల మానవతా సహాయాన్ని గణనీయంగా పెంచాలని పిలుపునిచ్చింది. అలాగే, తీవ్రమైన పోషకాహార లోపానికి చికిత్సను పెంచా లని, బలహీనమైన కుటుంబాలు తమను తాము నిలబెట్టుకోవడంలో సహా యపడటానికి ముఖ్యమైన వ్యవసాయ సహాయాన్ని అందించాలని, అలాగే ప్రతిస్పందన ప్రయత్నాలను మెరుగుపరచడానికి విశ్లేషించని ప్రాంతాల్లో ఆహార భద్రత, పోషకాహార సర్వేలను నిర్వహించాలని పిలుపునిచ్చింది.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
editpage@suryaa.com
features@suryaa.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# అంబేద్కర్ పట్ల అక్కస్సు ఎందుకు ?

**మన్నారం నాగరాజు**
**95508 44433**



(నిన్నటి సంచిక తరువాయి)

**డాక్టర్ అంబేద్కర్ సామాజిక తత్వం:**

తాత్విక చింతన అనేది "ఏ విషయాన్నైనా కూలంకషంగా ఆలోచించి నిర్ధారించేందుకు పట్టుదలగా సాగే కృషి". అందువలన తాత్విక చింతనను సామాజిక, రాజకీయ తాత్విక చింతనలు మొదలైన విభాగాలుగా చూడడం, విభజించడం సాధ్యం కాదు. ఏదైనా ఒక అంశం అర్ధవంతమైనది అని స్వయంగా నిర్ధారణ చేసుకోవడానికి వీలుగా ఆలోచనా పరులైనవారు తమ జీవితాలను బౌద్ధిక పరమైన క్రమశిక్షణలో పెట్టుకోవలసిన అవసరం నుండే ఈ తాత్విక చింతన పుట్టుకొస్తుంది. తాత్విక చింతన ఎప్పుడూ పరిపూర్ణమైనదిగా ఉండాలి. మానవ జీవితాలలోని ప్రతి అంశాన్ని అందుకు సంబంధించిన ప్రతి ఆలోచననూ పరిగణనలోనికి తీసుకోవాలి. ఈ నియమ పాలన అంబేద్కర్కు కూడా వర్తిస్తుంది.అందువల్ల ఏ సామాజిక తాత్విక చింతన అయినా తప్పనిసరిగా "సమాజ స్వభావాన్ని, సమాజ అస్తిత్వాన్ని నిర్దేశించే సూత్రాలను, సామాజిక జీవనాన్ని, కార్యాచరణను విశ్లేషించేందుకు ప్రయత్నం చేస్తూ సమాజాన్ని మొత్తం పరిశోధించేదిగా వుండాలి.యావత్ సామాజిక జీవనానికి మనిషే మూలం. అన్ని సామాజిక కార్యకలాపాలు మనిషి వల్లనే ఆరంభమవుతాయి. అతడికి తనవైన లక్ష్యాలు, విలువలు వున్నాయి. మానవ జీవనానికి అంతిమగమ్యం ఏమిటనేది కనుగొనడమే సామాజిక తాత్విక చింతన ధ్యేయం, కర్తవ్యం. భారతీయ సామాజికత నేపథ్యంలో, డాక్టర్ అంబేద్కర్ ఈ లక్ష్యసాధనకు పూనుకున్నారు.తీక్షణమైన బుద్ధి, సామాజిక నాడిని పసిగట్టే నేర్పుగల అంబేద్కర్ సంప్రదాయాలకు కట్టుబడి, ఛాందస భావాలను, మార్పు కంగీకరించని నైజాన్ని కలిగిన హైందవ సామాజికవ్యవస్థను, లోతుగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. అంటరానివారిని నిరాశా, నిస్పృహలు ముప్పిరిగొనే దుస్థితికి నెట్టిన హైందవ సామాజిక వ్యవస్థ, మతాచారాలు అమానుషం, అశాస్త్రీయం, నిర్హేతుకమని అంబేద్కర్ విమర్శించారు. తత్ఫలితంగానే అంటరాని వారు అణగారిన, అసంఘటిత, బీద ప్రజలుగా మిగిలిపోయారు. ఈ పరిస్థితులే డాక్టర్ అంబేద్కర్ క్రూరమైన అంటరానితనం, ఆవిర్భావానికి, అభివృద్ధికి కల చారిత్రక ఆధారాలను కనుగొనేందుకు, కుల వ్యవస్థ గురించి, శూద్రుల గురించి పరిశోధించేందుకు ప్రేరేపించాయి. సామాజికంగా తమకుగల 'స్థాన' బలంతో క్రూరమైనవీ, అశాస్త్రీయతతో నిర్హేతుక మైనవీ, నమ్మశక్యంగానివైన సామాజిక మతాచారాలను రూపొందిం చి, షెడ్యూల్డు కులాల వారి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవనంపై అమానుషంగా దాడిచేసిన అగ్ర వర్ణ హైందవ తత్వవేత్తల కుట్రను, నయవంచనను ఆయన సరిగా గుర్తించగ లిగారు. వీరివల్లనే అంటరాని వారు యుగయుగాలుగా హైందవ సామాజిక జీవనంలో అణచివేతకు గురి అవుతూ వచ్చారు. అసంఘటిత వర్గంగా, బీదలుగా మిగిలిపోయి దారితోచక కొట్టు మిట్టాడుతున్నారు. బహుశా ఇందువల్లనే డాక్టర్ అంబేద్కర్ శూద్రులపైన, అస్పృశ్యతపైనా, కుల వ్యవస్థపైనా కొన్ని గ్రంథాలు రాశారు.

అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని రచించిన మేధావి, అధ్యయనశీలి, ఆర్థికవేత్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రచయిత బాబాసాహెబ్ అంబేద్కర్. ఆయన పట్లా అక్కస్సు ఎందుకు ?. దేశ ప్రజల మనోభావాలు ఎంతగా దెబ్బతింటు న్నాయో పట్టించుకోరా.. అధికార బలం ఉందికదా అని తప్పుడు మాటలు మాట్లాడినా, బహుజన వర్గాలు ఊరుకుంటారా..? బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు ఆచి చూచి మాట్లాడలేరా... ఇంత అహంకారం ఎందుకో అని ప్రజలు విమర్శిస్తున్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా సామాజిక న్యాయం, సమానత్వం, మరియు మానవ హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘసుధారకుడు. ఆయనను అవమానించడం ఏ విధం గానూ సమంజసం కాదు.ఆయన కృషి వల్లే సమాజంలోని అణ గారిన వర్గాలకు న్యాయం దక్కింది. ఆయనను అవమానించడం ద్వారా ఆ వర్గాలకు సంబంధించిన విజయాలను, వారి హక్కులను తక్కువ చేసి చూపినట్లవుతుంది.ఏ లక్ష్యాల కోసమైతే ఆయన పోరాడారో వాటికే ఇప్పుడు ముప్పు ముంచుకొచ్చింది. కాషాయ మూకలు తమ వికృత క్రీడకు విశ్వ విద్యాలయాలను సైతం ప్రాంగ ణాలుగా మార్చుకుంటున్నాయి. భావి పౌరుల మెదళ్లలోకి కుల, మతాల విషాన్ని చిమ్మడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒకవైపు ప్రైవేటీకరణ జపం చేస్తూ మరోవైపు ప్రభుత్వ ఉ ద్యోగాల్లో ఉన్న నామ మాత్రపు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించాయి. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న మౌలిక లక్ష్యాలైన లౌకిక, సామ్యవాద భావాలకు వ్యతిరేకంగా ప్రచారాన్ని బిజెపి చాప కింద నీరులా చేస్తోంది. దళిత, గిరిజనుల నుండి భూమిని లాక్కునే దౌర్జన్య కాండకు పాలకులే దిగుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓ బి సి, సబ్ ప్లాన్ నిధులు కాగితాలకే పరిమితమయ్యాయి, హిందూ మతంలోని నిచ్చెనమెట్ల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన పోరాటం చేస్తే, ఆ దిగజారుడు వ్యవస్థను పునరుద్ధరించడానికి కంకణం కట్టుకున్న నేటి పాలకులు ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా బాధిత ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారు. రకరకాల విజన్లను తెరమీదకు తీసుకువస్తున్న పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే అంబేద్కర్ విజన్ ను రూపొందించాలి. నిర్ణీత కాలవ్యవధిలో ఆయన ఆకాంక్షించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రణాళికను ప్రకటించి అమలు చేయాలి. అంబేద్కర్ లక్ష్మించిన కుల వివక్షకూ, హిందూత్వ మౌఢ్యానికి వ్యతిరేకంగానూ, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్ల సాధనకూ పెద్ద ఎత్తున ప్రచారం చేయాల్సిన కృషికి అభ్యుదయ, పురోగామి శక్తులు అంకితం కావాల్సివుంది. సమీకరించడం, బోధించడం ద్వారా వివక్షకు, దోపిడీకి గురవుతున్న ప్రజలను సంఘటిత పోరాటాల వైపు నడిపించడానికి ప్రతినబూనాల్సిన తరుణమిది.

# బిజినెస్

## టాటా .ఈవి ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల స్వీకరణ పెరుగుతున్నందున, టైర్ 1 నగరాల్లో బలమైన విస్తృతమైన ఛార్జింగ్ అవస్థాపన వృద్ధి వేగాన్ని కొనసాగిస్తోంది, అయితే, ఆసక్తికరంగా, టైర్ 2 మరియు టైర్ 3 నగరాలు చాలా వెనుకబడి లేవు. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకారం, 24 ఆర్థిక ఏడాది లో టైర్ 2 మరియు టైర్ 3 నగరాల్లో ఛార్జింగ్ నెట్‌వర్క్ 96% పెరిగింది మరియు దేశంలోని 59% ఫాస్ట్ ఛార్జింగ్ పాయింట్‌లు ఈ ప్రాంతాల్లోనే ఉన్నాయి. భారతదేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీకి మార్గదర్శకులుగా, టాటా.ఈవీ దాని ఓపెన్ కోలాబరేషన్ ఫార్మాట్ ద్వారా, ముఖ్యంగా టైర్ 2 మరియు 3 నగరాల్లో ఛార్జింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడానికి కీలకమైన వాటాదారులతో వ్యూహాత్మకంగా భాగస్వామ్యం చేస్తోంది. వాహన్ డేటా ప్రకారం 23 ఆర్థిక ఏడాది , టైర్ 2 మరియు టైర్ 3 నగరాల్లో 4-వీలర్ ఈవీ రిజిస్ట్రేషన్లలో 49% ఉన్నాయి. ఈ ట్రెండ్ వేగవంతమైంది ఆర్థిక ఏడాది 24లో వాటా 58%కి పెరిగింది మరియు 25 ఆర్థిక ఏడాది లో 66% ఆకట్టుకునేలా ఉంది, ఇది టైర్ 1 నగరాల్లో వృద్ధిని గణనీయంగా అధిగమించింది. ఇండిపెండెంట్ హోమ్‌లు హోమ్ ఛార్జింగ్ కోసం స్థలం మరియు సోలార్ రూఫ్‌టాప్ ఇంటిగ్రేషన్‌కు అవ కాశాలను అందించడంతో, టైర్ 2 మరియు 3 నగరాలు జీరో-కాస్ట్, జీరో-ఎమిషన్ మొబిలిటీని ఎక్కువగా స్వీకరిస్తున్నాయి.




## వచ్చే వారం 3 కంపెనీల ఐపీఓలు సందడి




ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లో ఐపీఓల సందడి కొనసాగిన సంగతి తెలిసిందే. కాగా 2024లో ఇప్పటివరకు మెయిన్ బోర్డు నుంచి 91 కంపెనీలు ఐపీఓకు వచ్చి సుమారు రూ. 1.59 లక్షల కోట్ల నిధుల్ని సమీకరించాయి. ఇదిలా ఉంటే.. డిసెంబర్ నాలుగో వారం కూడా దలాల్ స్ట్రీట్ లో ఐపీఓలు హవా కొనసాగనుంది. వచ్చే వారం కొత్తగా 3 కంపెనీలు ఐపీఓ సబ్ స్క్రిప్ష న్‌కు రానున్నాయి. అయితే ఇందులో మెయిన్ బోర్డ్ నుంచి ఒక కంపెనీ ఉం డగా.. ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి రెండు కంపెనీలు పబ్లిక్ ఇష్యూ రానున్నా యి. ఇక మెయిన్ బోర్డ్ విభాగం నుంచి ట్రాక్టర్లు , క్రేన్లు తయారుచేసే కంపెనీ ఇండో ఫార్మ్ ఎక్విప్మెంట్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ కు రానుంది. ఈ సంస్థ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ డిసెంబర్ 31న ప్రారంభమై జనవరి 2 వరకు కొనసాగ నుంది. ఐపీఓ ద్వారా సుమారు రూ. 260.15 కోట్లను సమీకరించాలని కంపె నీ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 1,21,00,000 షేర్లను జారీ చేయనున్నా రు. ఒక్కో షేరు ధరను రూ.204-రూ. 215గా నిర్ణయించింది. ఇక ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి రాబోతున్న వాటిలో డ్రై ఫ్రూట్స్ అండ్ స్పైసెస్, టెక్నీకెమ్ ఆర్గానిక్స్ ఐపీఓలు ఉన్నాయి. అలాగే వచ్చే వారం ఆరు కంపెనీలు స్టాక్ మార్కెట్ లో లిస్టింగ్ కానున్నాయి.

## జనవరిలో15 రోజులు బ్యాంకులకు సెలవులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి నెలా బ్యాంకు సెలవుల జాబితా విడుదల చేస్తుంటుంది. అదే విధంగా జనవరి 2025 సెలవుల లిస్ట్ విడుదలైంది. కొత్త ఏడాది మొదటి నెలలో ఏకంగా 15 రోజులు సెలవులున్నాయి. అయితే ఇందులో జాతీయ సెలవులతో పాటు ప్రాంతీయ సెలవులున్నందున రాష్ట్రాన్ని బట్టి మారనున్నాయి. ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ లావాదేవీలే జరుగుతున్నాయి. అంతా డిజిటలైజేషన్ అయినా సరే కొన్ని ప్రత్యేక పనులుంటే మాత్రం బ్యాంకులకు వెళ్లక తప్పని పరిస్థితి ఉంటుంది. అందుకే బ్యాంకు పనులుంటే బ్యాంకు సెలవుల్ని బట్టి ప్లాన్ చేసుకోవాలి. ఆర్బీఐ ప్రతి నెలా జారీ చేసినట్టే వచ్చే ఏడాది 2025 జనవరి నెల హాలిడేస్ లిస్ట్ విడుదల చేసింది. జనవరిలో బ్యాంకులకు 15 రోజులు సెలవులున్నాయి. ఇందులో రెండవ, నాలుగవ శనివారాలతో పాటు ఆదివారాలు, రిపబ్లిక్ డే, సంక్రాంతి సెలవులున్నాయి. బ్యాంకులకు సెలవులున్నా ఆన్‌లైన్ సేవలు, ఏటీఎం సేవలు మాత్రం కొనసాగనున్నాయి.




**జనవరి 2025 బ్యాంకు సెలవుల జాబితా**

జనవరి 1 న్యూ ఇయర్ దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు
జనవరి 2 మన్నమ్ జయంత్రి కేరళలో సెలవు
జనవరి 5 ఆదివారం సెలవు
జనవరి 6 గురు గోవింద్ సింగ్ జయంతి, హర్యానా, పంజాబ్‌లో సెలవు
జనవరి 11 రెండవ శనివారం సెలవు
జనవరి 12 ఆదివారం సెలవు
జనవరి 14 మకర సంక్రాంతి , ఏపీ, తెలంగాణ, తమిళనాడులో బ్యాంకులకు సెలవు
జనవరి 15 మకర సంక్రాంతి, తిరువల్లూరు డే, తమిళనాడు, అసోంలో సెలవు
జనవరి 16 ఉజ్జవర్ తిరునాళ్, తమిళనాడులో సెలవు
జనవరి 19 ఆదివారం సెలవు
జనవరి 22 ఇమోయిన్, మణిపూర్‌లో సెలవు
జనవరి 23 నేతాజి జయంతి, మణిపూర్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, పశ్చిమ బెంగాల్, జమ్ము కశ్మీర్, ఢిల్లీలో బ్యాంకులకు సెలవు
జనవరి 25 నాలుగో శనివారం సెలవు
జనవరి 26 రిపబ్లిక్ డే, ఆదివారం సెలవు
జనవరి 30 సోనమ్ లోసర్ సిక్కింలో సెలవ

## భారతీయ బీమా రంగము నిరంతర పరివర్తన




2024 గురించి ఆలోచిస్తే, గణనీయమైన పరిశ్రమ అభివృద్ధి మరియు వినియోగదారుడి అవసరాలను నెరవేర్చుటకు స్థిరమైన నిబద్ధత అధారితమైన భారతీయ బీమా రంగము నిరంతరం పరివర్తన చెందుతోంది. ప్రపంచవ్యాప్త బీమా రంగము ఆకస్మిక మార్పులు ఎదుర్కొంటుండగా, భారతదేశములో ఈ రంగము స్థితిస్థాపకంగా నిలిచింది కాని గుర్తించదగిన డైనమిజం కూడా చూపింది. విస్తృతమైన ఉపయోగించబడని సామర్థ్యముతో బీమా చొరబాటు ప్రారంభ దశలలో ఉన్నప్పటికీ, ఇది ప్రపంచములోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నవాటిల్లో ఒకటి. దేశపు బీమా మార్కెట్ రాబోయే దశాబ్దములో, కొత్త అవకాశాలను ఆవిష్కరిస్తూ, దేశీయ బీమా మార్కెట్ తన ప్రస్తుత పరిమాణము కంటే 3-5 రెట్లు పెరుగుతుందని ఆశించబడుతోంది. ఈ అభివృద్ధి ప్రగతిశీల నియంత్రణ పాలసీలు, పరిశ్రమ సమకాలీనికుల మధ్య సహకారము మరియు పంపిణీ మరియు సాంకేతిక సామర్థ్యాలను మెరుగుపరచడము పై ధృఢమైన ప్రాధాన్యతల ఆధారితమై ఉంటుంది.

# రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమే

- ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పునాది ఖమ్మం కేంద్రంగా బీసీల రాజ్యాధికార ఉద్యమ నిర్మాణం
- అగ్రకులాలు బీసీల అవకాశాలను హరిస్తున్నాయి
- ఆత్మగౌరవం కోసమే బీసీల రాజ్యాధికార పోరాటం
- రాష్ట్రంలో తీవ్ర వివక్షతకు లోనవుతున్న బీసీలు
- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి:ఉద్యమాలకు, పోరాటాలకు, ప్రజా విప్లవాలకు నిలయమైన ఖమ్మం జిల్లా కేంద్రంగా బీసీల రాజ్యాధికార ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ ఉద్ఘాటించారు.. శనివారం ఖమ్మంలోని పూలే అంబెద్కర్ అధ్యయన వేదికలో జిల్లా ఇంచార్జి గండి వీరేందర్ నేతృత్వంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బీసీ ముఖ్య సమావేశానికి అనేకమంది బీసీ ప్రముఖులు హాజరయ్యి రాజ్యాధికార నినాదాలు చేశారు..స్థానిక బీసీ నాయకులతో కలిసి ప్రముఖ బీసీ నాయకులు వీజీఆర్ నారగోనితో కలిసి పూలే అంబెద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు సమర్పించారు. తదనంతరం సమావేశాన్ని ఉద్దేశించి దాసు సురేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనన్నారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి 1969 లోనే పునాది వేసిన ఖమ్మం జిల్లా కేంద్రంగా బీసీల రాజ్యాధికార ఉద్యమ నిర్మాణాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. రాష్ట్రంలో దేశంలో అగ్రకులాలు బీసీల వ్యాపార , రాజకీయ అవకాశాలను హరిస్తున్నాయని ఆరోపించారు .. ఊరికి ఒకరు కలిసి వస్తే రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పార్టీలకు బీసీల పట్ల అనివార్యత సృష్టిస్తామని, ఇంటికొకరు కలిసి వస్తే రాజ్యాధికారాన్ని అట్టడుగు వర్గాల చేతిలో బహుమతిగా అందిస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ పిలుపునిచ్చారు. ఖమ్మం రాజకీయాల్లో సామాజిక న్యాయం కొరవడిందని మండిపడ్డాడు. ఖమ్మం లో 28 లక్షల జనాభా ఉండగా అందులో 80% బడుగు బలహీన వర్గాలు గిరిజన తెగలు ఉండగా అధికారంలో ఇప్పటికి 80% అగ్రవర్ణాలే ఉన్నాయన్నారు.50 శాతం బీసీ జనాభా పైబడిన ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బిసి ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం కనిపించకుండా పోయిందని మండి పడ్డారు. సోషల్ జస్టిస్ జేఏసీ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు,బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడకపోవడం వల్లనే అగ్రవర్ణాల అజమాయిషి కొనసాగుతుందన్నారు. అధికారం కోసం బీసీలు తిరగబడితే అనివార్యంగా అగ్రవర్ణాలు వారి కుర్చీలు ఖాళీ చేసే రోజు ఎంతో దూరంలో లేదని వెల్లడించారు.అగ్రవర్ణాల ప్రజలు తమ వాటాను తాము అనుభవించుకుంటూనే బీసీ ఎస్సీ,ఎస్టీల, గిరిజన వాటాను కూడా అనుభవిస్తామనడం ఏ మేరకు సమంజసం అన్నారు.. ఇకపై అగ్రవర్ణాల వాటా అగ్రవర్ణాలు, అట్టడుగు వర్గాల వాటా అట్టడుగు వర్గాలు అనుభవించేలా సామాజిక న్యాయాన్ని సాధిస్తామన్నారు. రాష్ట్ర మహిళా నాయకురాలు కొండా పద్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఉపకరించే విధంగా తమిళనాడు తరహాలో రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలును రద్దు చేయాలని కోరారు. బీసీలు సమర్థమైన నాయకులను తయారు చేసుకోకపోవడం, నిర్ణయాలు జరిగే అసెంబ్లీ పార్లమెంటులలో ఈ వర్గాలు లేకపోవడం వల్లనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర సెక్రటరీ ముంజాల రాజేందర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ,బొమ్మగాని ధర్మభిక్షంల అడుగుజాడల్లో ఖమ్మంలో బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేస్తామన్నారు. యువత,మహిళలు రాజకీయాల్లోకి రానంతవరకు ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగుతాయని తెలిపారు.. ఈ పరిస్థితులను అధిగమించేలా ఇప్పటికే క్షేత్రస్థాయిలో బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ అన్ని జిల్లాలలో నాయకత్వ నిర్మాణాన్ని చేపట్టామని,యువ నాయకులను, మహిళలనుప్రోత్సహిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వారిని పోటీకి దింపనున్నామన్నారు.

ప్రముఖ న్యాయవాది విజయశాంతి మాట్లాడుతూ 103వ రాజ్యాంగ సవరణ ద్వారా 2019లో ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా నేడు అట్టడుగు వర్గాలకు విద్య ఉద్యోగ అవకాశాలు అందక యువత నైరాశంలోకి నెట్టబడి పరిస్థితులు దయనీయంగా మారాయన్నారు. 8 లక్షల పైబడిన సంపాదన ఉన్న బీసీ వర్గాలను క్రిమి లేయర్ గా అభివర్ణిస్తు వారిని రిజర్వేషన్లకు దూరం చేస్తూ 8 లక్షల సంపాదన ఉన్న అగ్రవర్ణ విద్యార్థులను మాత్రం కేంద్ర ప్రభుత్వం పేదవారుగా పరిగణించడం ఏ మేరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంమంలో రాష్ట్ర ముఖ్య సహోదారుడు, సుంకరి శ్రీనివాస్, కత్తి విజయ్ గౌడ్,,వెంకటస్వామి, బండి నాగేశ్వరరావు గౌడ్, ఖమ్మం ఇన్చార్జి, పొడగంటి రాంబాబు చారి, జనసభ రాష్ట్ర సెక్రటరీ, జూలూరి రమేష్ గౌడ్,కొడుపు గంటి శ్రీధర్, పల్లెపు సోమరాజు, పెరుగు రమణ, టీవీ రాజ్ గురు, నర్ర మల్లయ్య, కర్నే రామారావు, తామర కొండ కొమరయ్య, మహిళా నాయకురాలు అచ్చ నాగమణి, కొలిపాక నాగమణి ఖమ్మం బీసీ వాసులు అధికసంఖ్యలో పాల్గొనీ బీసీ సమస్యలను దయానేయ స్థితిని కళ్ళకు కట్టినట్టు చెప్పారు. బీసీ లు ఇకనైనా సంగటితం కావాలని మన హక్కులు మనమే ముకుమ్మడి గా సాధిచుకోవాలని దాసు సురేష్ పిలుపు నిస్తూ,రాజ్యాధికార సమితి,క్యాలెండరు ఆవిష్కరణ చేసారు

## కవిత తెగ హడావుడి చేస్తున్నారు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బీసీల సమస్యలను పరిష్కరించుకొనే కర్మ తమకు పట్టలేదన్నారు. కవిత నాయకత్వం బీసీలకు అవసరం లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి ఏనాడైనా కవిత మాట్లాడారా? అని నిలదీశారు.

బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెగ హడావిడి చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ బీసీలతో అసలు కవితకు ఏం సంబంధమని ప్రశ్నించారు. బీసీలపైన ముసలి కన్నీరు, కపట ప్రేమ కవిత చూపిస్తోందని మండిపడ్డారు. బీసీల గురించి ఆమె పోరాడాల్సిన అవసరం ఏముందని అడిగారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడే శక్తి బీసీలకు ఉందని.. బీసీ నాయకత్వంలో సమస్యలను పరిష్కరించుకుంటామని అన్నారు. “కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బీసీల సమస్యలను పరిష్కరించుకొనే కర్మ మాకు పట్టలేదు” అంటూ వ్యాఖ్యలు చేశారు. కవిత నాయకత్వం బీసీలకు అవసరం లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి ఏనాడైనా కవిత మాట్లాడారా? అని నిలదీశారు. దేశానికి కులగణనలో తెలంగాణ రోల్ మోడల్గా మారిందని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ధ్యేయంగా కులగణన జరిగిందన్నారు. రాహుల్ గాంధీ సూచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన చేపట్టారని తెలిపారు.

గిరిజనులు, మైనార్టీలకు12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ అప్పుడు బీసీల గురించి ఎందుకు మాట్లాడలేదని అన్నారు. పదేళ్లలో బీసీలను ఏనాడు పట్టించుకోలేదని.. ఏ కార్యక్రమాన్ని సరిగా అమలు చేయలేదని మండిపడ్డారు. బీసీ కార్పొరేషన్తో పాటు ఇతర కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. బీసీకు రుణాలు ఇవ్వకుండా మొండి చేయి చూపించాన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదన్నారు. బీసీలపైన బీఆర్ఎస్ పార్టీకి అంత ప్రేమ ఉంటే కులగణనను ఎందుకు ఆహ్వానించలేదని మరో ప్రశ్న వేశారు. కులగణనపైన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు పాల్గొనలేదని అన్నారు. సామాజిక, ఉపాధి, విద్యా, రాజకీయంగా బీసీ వాటా కులగణనతో తేలిపోతుందని... దానికి అనుగుణంగా వాటా దక్కుతుందన్నారు.

# జనవరి 11న చలో తిరుపతి

- విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహా సభలు
- బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ల లో రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ తొలగించాలి
- గోడ పత్రిక ఆవిష్కరించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఏపీ విద్యుత్ బిసి ఉద్యోగుల 19వ రాష్ట్ర మహాసభ డైరీ ఆవిష్కరణ, గోడ పత్రిక జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరభద్రయ్య, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ మరియు మురళీకృష్ణ, గంగాధర్ తదితర విద్యుత్ ఉద్యోగుల సభ్యులు పాల్గొన్నారు.19వ రాష్ట్ర మహాసభలు మరియు డైరీ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఎస్ ఎస్ బి కళ్యాణ మండపం నందు జనవరి 11వ తేదీ శనివారం 11 గంటలకు జరుగుతుంది అని ఆర్ కృష్ణయ్య తెలిపారు. రాష్ట్రంలోని విద్యుత్ బిసి ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య, ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితా పాల్గొంటారని విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరభద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, వచ్చే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల ఉద్యమానికి బీసీ ఉద్యోగులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఐకమత్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలు కులాల పేరు మీద విడిపోవడం వలన న్యాయమైన డిమాండ్లు సాధించలేకపోతున్నారు. బీ సి లలో భావధ్యనం భానిస ఆలోచన విధానం పోవాలన్నారు. బీసీలు తెగించిన పోరాడకపోతే భానిస బ్రతుకులు, బిక్షపు బ్రతుకులు బ్రతక వలసి వస్తుంధాని హెచ్చరించారు. 75 సంవత్సరాల తరువాత రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించకపోతే ఇదేమి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. బీసీ కోటా క్రింద ఉద్యోగాలు వచ్చాయి. ఈ కులాల నుంచి వచ్చినందున ఈ కులాల అభివృద్ధి కోసం పోరాడే సాంఘిక బాధ్యత భుజాన వేసుకోవాలని పిలుపు నిచ్చారు. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యంగా పరమైన , న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవు. రాజ్యాంగ బద్ధమైన మండల్ కమీషన్ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరి కమిటీ చైర్మన్ నాచియప్పన్ కమిటీ బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇక ఇటివల సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం బిసి ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సీ ఎస్టీ బీసీ లకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్ని వైపుల నుంచి బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులున్నాయి. ప్రమోషన్లలలో రిజర్వేషన్లు పెట్టడానికి ఎలాంటి అవరోధాలు లేవన్నారు.

## ప్రతి పనిలోనూ విశ్వకర్మలు కీలకం..

**- ఎంపీ ఈటల రాజేందర్**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: దేశంలో వ్యవసాయం, దుస్తులు ఆఖరికి ఇల్లు కావాలన్నా జీవించడానికి కావాల్సిన ప్రతి ప్రధాన పని విశ్వకర్మలతోనే ముడి పడి ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. అఖిలభారత విశ్వకర్మ మహాసభను అధ్యక్షుడు కౌలె జగన్నాథం అధ్యక్షతన కొత్తపేట బాబుజగ్జీవన్రామ్ భవన్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈటల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమన్నారు.ఆ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ సాధన ఉద్యమంలో ప్రాణాలర్పించిన శ్రీకాంతాచారిలే ఇందుకు నిదర్శనమన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ కి గుజరాత్ రాష్ట్రంలో అత్యంత సన్నిహితంగా ఉన్న వర్గాలు విశ్వకర్మలేనన్నారు. విశ్వకర్మల ఆర్థికాభివృద్ధి కోసం ప్రధాని మోదీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన గుర్తు చేశారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో 25లక్షల జనాభ కలిగి ఉన్న విశ్వకర్మలు కులవృత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తునారన్నారు. తెలంగాణ వస్తే కులవృత్తులకు తోడ్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారని ఆశపడ్డారని తొమ్మిదేళ్ల కాలంలో పాలకులు విశ్వకర్మల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. జగన్నాథం మాట్లాడుతూ విశ్వకర్మ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. 55 సంవత్సు రాలు నిండిన వృత్తి కళాకారులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర రాజధానిలో కేటాయించిన 5ఎకరాల స్థలంలో రూ. 200కోట్లతో అన్ని వస తులతో విశ్వకర్మ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సెప్టెంబర్ 17న విశ్వకర్మ జ యంతి సందర్భంగా ప్రతిభకనబర్చిన విశ్వకర్మ చేతి వృత్తి దారులకు గౌరవ పురస్కారాలు ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రాధాధీం్రెడ్డి, పవన్కుమార్, విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు చెడ్డిలా ల్యర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐల్వేకుమార్, ప్రధాన కార్యదర్శి దినేష్ బాయ్యర్మ, ఉపాధ్యక్షుడు ఎంఎం శర్మ, నాయకులు మనోరంజన్, రాజశేఖర్, కృష్ణగంజ్, సూర్య నారాయణ, గులాబ్యర్మ, చెన్నయ్యచారి, లింగాచారి, మురళీధర్చారి పాల్గొన్నారు.

### మన్మోహన్ సింగ్ మద్దతుతో

# హైదరాబాద్ మెట్రో

**- ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: హైదరాబాద్ మెట్రోపై ఎన్నో విమర్శలు వచ్చినా.. పీపీపీ విధానమే సరైనదని, ఈ పద్ధతిని కొనసాగిస్తూ అంతర్జాతీయ టెండర్లకు వెళ్లండని అప్పట్లో నాటి ప్రధాని మన్మోహన్సింగ్ ప్రోత్సహిస్తూ తమకు మద్దతుగా నిలిచారని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఆయన మద్దతు లేకుంటే ప్రపంచ చరిత్రలో ఒక అరుదైన పీపీపీ మెట్రో ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో అవతరించేది కాదని, ఆయనకు హైదరాబాద్ నగరవాసులు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్సింగ్ మృతికి ఒక ప్రకటనలో ఎన్వీఎస్ రెడ్డి సంతాపం తెలిపారు.అప్పటి ప్రధానిగా ఉన్న డాక్టర్ మన్మోహన్సింగ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా కొనసాగిన డాక్టర్ మాంటెక్సింగ్ అహ్లువాలియా, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఎస్.జైపాల్రెడ్డిల ప్రోద్బలంతో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్రెడ్డి ఆదేశాలతో తాము మెట్రోరైల్ను పీపీపీ విధానంలో రూపొందించామన్నారు. దీనిని మన్మోహన్సింగ్ అభినందించారని ఎన్వీఎస్ రెడ్డి గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోలో విజయవంతమైన పీపీపీ బిడ్డింగ్ విధానంపై అప్పటి ప్రణాళిక సంఘం ఉపా ధ్యక్షుడు డాక్టర్ మాంటెక్సింగ్ అహ్లువాలియాకు తాను లేఖ ద్వారా వివరించగా.. దానిపై మన్మోహన్సింగ్ హైదరాబాద్ మెట్రో ఒక దిక్సూచిగా నిలుస్తుందని, దేశంలో ఇతర ప్రాజెక్టులు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. మేటాస్ వైఫ ల్యం ఉదంతంతో అనేకమంది హైదరాబాద్ మెట్రోపై విమర్శలు గుప్పించినా.. ఇదే సరైన విధానమంటూ మెట్రో పీపీపీ విధానానికి మద్దతుగా నిలిచారని తెలిపారు.

## ఫార్ములా ఈ రేసింగ్ కేసులో కీలక పరిణామం




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఫార్ములా ఈ రేసింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఈడీకి ఏసీబీ అందజేసింది. ఏసీబీ ఇచ్చిన వివరాలను ఈడీ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈడీ విచారణను మరింత వేగవంతం చేసే అవకాశం ఉంది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులోని వివరాలను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఏసీబీ అందజేసింది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక శాఖ రికార్డ్స్, హెచ్ఎండీఏ చెల్లింపుల వివరాలు, హెచ్ఎండీఏ చేసుకున్న ఒప్పంద పత్రాలతో పాటు ఎఫ్ఐఆర్ను ఈడీకీ ఏసీబీ అందజేసింది. అలాగే ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో హైకోర్టులో ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కౌంటర్లో కీలక అంశాలను ఏసీబీ ప్రస్తావించింది. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగించడంతో పాటు నేరపూరిత దుష్ప్రవర్తనకు కేటీఆర్ పాల్పడ్డారని కౌంటర్లో ఏసీబీ పేర్కొంది. కేబినెట్ నిర్ణయం, ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే చెల్లింపులు చేయాలని అధికారులపై కేటీఆర్ ఒత్తిడి చేశారని.. అనుమతులు లేకుండా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు బదిలీ చేశారని తెలిపారు. దీని వలన హెచ్ఎండీఏకు రూ.8 కోట్లు అదనపు భారం పడిందని అసంబద్ధమైన కారణాలు చూపి కేసును కొట్టివేయాలని అడగడం దర్యాప్తును అడ్డుకోవడమే అని వెల్లడించింది. కేటీఆర్ వేసిన పిటిషన్కు విచారణ అర్హత లేదని ఏసీబీ కౌంటర్లో పేర్కొంది. అధికారుల నుంచి అనుమతి పొందిన తర్వాతనే కేటీఆర్పైన ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఏసీబీ తెలిపింది.రాజకీయ కక్షతోనో, అధికారులపై ఒత్తిళ్లతోనూ కేసు నమోదు చేశామనడం సరైనది కాదని వెల్లడించింది. మున్సిపల్ శాఖ ఒప్పందా లు కుదుర్చుకున్నప్పుడు బిజినెస్ రూల్స్ను ఉల్లంఘించారని తెలిపింది. ఎఫ్ఈఓకు చెల్లింపులు జరపాలని స్వయంగా కేటీఆర్ వెల్లడించినట్లు తానే చెప్పారని.. ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ ఆలస్యం అయినందున కేసు కొట్టివేయాలని కోరడం సరైంది కాదని ఏసీబీ తెలిపింది. తీవ్రమైన అభియోగాలు ఉన్నప్పుడు ప్రాథమిక విచారణ లేకుండానే కేసు నమోదు చేయవచ్చన్న సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయన్న కౌంటర్లో ఏసీబీ పేర్కొంది. మరోవైపు ఈకేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 7 విచారణకు రావాల్సిందిగా ఈడీ నోటీసుల్లో పేర్కొంది. అలాగే ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా ఉన్న హెచ్ఎమ్ డీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి కూడా ఈడీ నోటీసులు పంపింది. వారిని జనవరి 2,3 తేదీల్లో తమ ముందుకు విచారణకు హాజరుకావాల్సింది ఈడీ నోటీసుల్లో తెలిపింది. మరోవైపు ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్పై నిన్న శుక్రవారం హైకోర్టులో విచారణకు రాగా.. డిసెంబర్ 31 వరకు కేటీఆర్ను అరెస్ట్ చేయొద్దని న్యాయస్థానం ఆదేశించింది. అలాగే కేటీఆర్ నాట్ టు అరెస్ట్ ఆదేశాలను ఎత్తివేయాలని ఏసీబీ పిటిషన్ వేయగా.. కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.


**CHANGE OF AFFILIATING UNIVERSITY**

**Malineni Perumallu Pharmacy College, Pulladigunta, Guntur,** presently affiliated with JNTU-Kakinada (since 2009), will be changing its affiliation to **Acharya Nagarjuna University (ANU),** Guntur, from the Academic Year 2025-26.
**Important Notice:** Students, parents, and stakeholders who may have concerns or issues regarding this change are requested to contact the College Management within two working days.
**For more details Contact: 99129 29896.**

## 'పీఎం కేర్స్'కు తగ్గిన విరాళాలు..

డిల్లీ: దేశంలో కరోనా వైరస్ విలయ తాండవం చేస్తున్న సమయంలో.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'పీఎం కేర్స్ ' పేరుతో అత్యవసర సహాయ నిధిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ నిధులు రూ.912 కోట్లకు పడిపోయాయి. ఈ ఫండ్ ఏర్పాటు చేసిన అనంతరం ఒక ఏడాది వ్యవధిలో ఇంత తక్కువ నిధులు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. పీఎం కేర్స్ వెబ్సైట్ పై జరిగిన ఆడిట్ స్టేట్మెంట్ గణాంకాల ప్రకారం.. 2020-21లో అత్యధికంగా రూ.7184 కోట్ల విరాళాలు రాగా.. 2021-22లో రూ.1938 కోట్ల విరాళాలు వచ్చాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 912 కోట్లకు పడిపోయింది. కొవిడ్ తర్వాత ఈ నిధికి వచ్చే విదేశీ విరాళాలు బాగా తగ్గిపోయాయి. 2020-21లో గరిష్ఠంగా రూ. 495 కోట్లు రాగా.. తర్వాత రెండేళ్లలో రూ. 40 కోట్లు, రూ. 2.57 కోట్లకు పడిపోయింది. 2022-23లో మొత్తం వ్యయం దాదాపు రూ. 439 కోట్లు. దీనిలో రూ.346 కోట్లను.. కొవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల కోసం కేంద్రం వినియోగించింది. రూ. 92 కోట్లను ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల కోసం ఖర్చు చేసింది. 2021-22లో రూ. 1703 కోట్లను ఆక్సిజన్ కోసం ఖర్చు చేయగా.. రూ. 835 కోట్లను వెంటిలేటర్ల కోసం వెచ్చించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఫండ్ బ్యాలెన్స్ రూ. 6,283 కోట్ల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.

PM CARES
Prime Minister's Citizen Assistance and Relief in Emergency Situations Fund



# ఇక సెలవ్

- మన్మోహన్ సింగ్‌కు తుది వీడ్కోలు..
- ముగిసిన మాజీ ప్రధాని అంత్యక్రియలు
- ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు
- త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు నివాళులు
- అంత్యక్రియలకు హాజరైన రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు..
- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు, సిఎంలు

డిల్లీ: అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. దిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆయన పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాడె మోశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు. త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్‌కు నివాళులర్పించారు. అంత్యక్రియలకు దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.మన్మోహన్ పార్థివదేహాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల సందర్శనార్థం శనివారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు నివాళులర్పించారు. తర్వాత అక్కడినుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ సమయంలో రాహుల్.. మన్మోహన్ కుటుంబం వెన్నంటే ఉన్నారు. . తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంపీ మల్లురవి మన్మోహన్‌కు అంజలి ఘటించారు. ఏపీ కాంగ్రెస్ నేతలు పల్లంరాజు, కేవీపీ రామచంద్రరావు మన్మోహన్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు యావత్ దేశం అంతిమ వీడ్కోలు పలుకుతున్న సందర్భం ఇది. యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ అనీ, మౌన ముని అని ముద్రపడిన మన్మోహన్ చేసిన సేవలను ఆసేతుహిమాచలం గుర్తుచేసుకుంటోంది. 1991 నుంచి 2024 వరకు- దేశనిర్మాణంలో ఆయన పాత్రను నిన్నటితరం నెమరువేసుకుంటోంది. ఆయన సేవలను ఈ తరం తెలుసుకుంటోంది. మన్మోహన్ సింగ్ 1991లో ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టినా, 2004లో ప్రధానమంత్రిగా ప్రమాణం చేసినా, ఆయన జీవితంలో అన్నీ యాక్సిడెంట్లే. కానీ ఈ అనుకోని ఘటనలు, దేశానికి మేలు చేశాయి. మేలు చేయడమే కాదు, దేశాభివృద్ధికి బాటలు పరిచాయి.92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా పని చేశారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు.

**బైడెన్ సంతాపం..**

అంతకుముందు మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈమేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది











అన్నా యూనివర్సిటీ ఘటన పై

## మద్రాస్ హైకోర్టు సీరియస్

సిట్ ఏర్పాటు.. బాధితురాలి కి రూ.25 లక్షలు ఇవ్వాలని ఆదేశం



చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన గ్యాంగ్రేప్ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. డీఎంకే ప్రభుత్వ మెతకవైఖరి కారణంగానే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని విపక్షాలు ధ్వజమెత్తాయి. ఇక బీజేపీ చీఫ్ అన్నామలై అయితే డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విద్యార్థినిపై సామూ హిక అత్యాచారం ఘటనపై ప్రభుత్వం వ్యవహ రించిన తీరును తీవ్రంగా ఆక్షేపించారు. బాధితురాలి పేరు, వివరాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు నిర్లక్ష్యం కారణంగానే ఎఫ్ఐఆర్ కాపీ సోషల్ మీడియాలోకి వచ్చిందన్నారు. దీన్ని నిరసిస్తూ శుక్రవారం అన్నామలై కొరడా దెబ్బలు కొట్టుకుని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టు సీరియస్ అయింది. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సిట్ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. ఈ సిట్లో ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారులే ఉండాలని స్పష్టం చేసింది. అంతేగాక, బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం అందించాలని రాష్ట్ర సర్కారుకు ఆదేశాలు జారీ చేసింది. ఇక ఈ పరిణామాల కారణంగా విద్యార్థిని చదువుపై ఎలాంటి ప్రభావం పడకూడదని తెలిపింది. ఆమె నుంచి ఫీజు వసూ లు చేయొద్దని అన్నా యూనివర్సిటీని ధర్మాసనం ఆదేశించింది. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని డిసెంబరు 23న రాత్రి తన స్నేహితుడితో కలిసి వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి స్నేహితుడిపై దాడి చేసి అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఆమె ఫొటోలు తీసి.. పోలీసులకు చెబితే సోషల్ మీడియాలో పెట్టి పరువు తీస్తామని బెదిరించారు. అయితే తనకు జరిగిన ఘోరాన్ని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలు జల్లెడ పట్టి ఓ యువకుడిని అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. అయితే మరో నిందితుడికి డీఎంకేతో సంబంధాలున్నాయని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అతడిని ప్రభుత్వమే కాపాడుతుందని విపక్షాలు ధ్వజమెత్తాయి.విపక్షాల ఆరోపణలను డీఎంకే ఎంపీ కనిమొళి ఖండించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఎలాంటి పక్షపాతం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. మహిళల హక్కుల కోసం డీఎంకే కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులపై ముఖ్యమంత్రి ఆందోళన చెందుతున్నారని.. అందుకే తక్షణ చర్యలకు ఆదేశించాలని కనిమొళి తెలిపారు.



## వైద్యసాయం అందనీయరా?


- నేత క్షేమం కోరేవారై తే ఇలా చెందుకు చేస్తున్నా రు
- రైతు సంఘాల నేతల పై సుప్రీం ఆగ్రహం
- రైతు నాయకుడు దల్లేవాల్‌కు వైద్య సహాయం అందేలా చూడాలని ఆదేశం

దిల్లీ: రైతు సంఘాల నేతలపై సుప్రీంకోర్టు ) ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తున్నా.. ఆయనకు వైద్య సహాయం అందకుండా అడ్డుకుంటున్న రైతు సంఘాల తీరును అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. నిజంగా ఆయన క్షేమం కోరుకునేవారైతే అలా అడ్డుకోరనే విషయాన్ని వారికి తెలియజేయాలని జస్టిస్ సూర్యకాంత్ పంజాబ్ చీఫ్ సెక్రటరీకి సూచించారు.దల్లేవాల్‌కు వైద్య సహాయం అందించాలన్న ఆదేశాలను అమలుచేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యంపై విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. నిరవధిక దీక్షను కొనసాగిస్తున్న దల్లేవాల్‌కు వైద్యసహాయం అందేలా చూడాలని తాము పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చామని.. అయితే వాటిని అమలుచేయడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలపై కోర్టు సంతృప్తి చెందలేదని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

ఈ విషయంలో పంజాబ్ రాష్ట్రానికి ఏదైనా సహాయం అవసరమైతే, కేంద్ర ప్రభుత్వం మద్దతివ్వాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ కేసుపై తదుపరి విచారణను డిసెంబర్ 31న చేపట్టనున్నట్లు వెల్లడించింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి జగ్జీత్ సింగ్ దల్లేవాల్ పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.

## కొత్త సంవత్సరం వేళ..
# చలో అయోధ్య..

- పోటెత్త నున్న పర్యటకులు
- ఇప్పటికే హొటల్స్ అన్నీ ఫుల్..!
- బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగి ఏడాది



అయోధ్య: కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, అలాగే బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో భారీగా భక్తులు తరలిరానున్నారు. దాంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థక్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది."భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉంది. జనవరి 15 వరకు హొటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయ్యాయి" అని స్థానిక హొటల్ యజమాని అంకిత్ మిశ్రా వెల్లడించారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హొటళ్ల యజమానులు ఒక్కరోజుకు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. "రాముడి ఆలయం, హనుమాన్గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేశాం" అని అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 22న అయోధ్య రామమందిరం లో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా బాలరాముడికి గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఆ వేడుకకు దేశ, విదేశాల్లోని అత్యంత ప్రముఖులు, స్వామీజీలు కలిపి దాదాపు 7 వేల మంది విచ్చేశారు. రాజకీయ, సినీ, క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు ప్రాణప్రతిష్ఠ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించి పులకించిపోయారు.అయోధ్య, వారణాసి ఆలయాలను దర్శించుకునే భక్తుల కారణంగా..ఉత్తరప్రదేశ్కు పర్యటకులు భారీగా తరలివస్తుంటారు. "రామ మందిర ప్రారంభం తర్వాత మొదటి ఆరు నెలల్లో యూపీకి పర్యటకుల రాక గణనీయంగా పెరిగింది. ఒక జనవరిలోనే రికార్డు స్థాయిలో ఏడుకోట్లమంది సందర్శించారు" అని ఇటీవల యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

## హెచ్1బీ అంశంపై మూర్ఖులను తొలగించాలి

- మస్క్ పోస్టు పై రిపబ్లికన్ పార్టీ లో తీవ్ర చర్చ
- పార్టీ నేతలు, ట్రంప్ మద్దతు దారు ల్లో భిన్నమైన వాదనలు

వాషింగ్టన్ : హెచ్1 బీ వీసాల విస్తరణపై డొనాల్డ్ ట్రంప్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇస్తుంటే.. ఇతరులు మాత్రం అమెరికా ఫస్ట్‌కు కట్టుబడి ఉన్నారు. దాంతో పార్టీ నేతల మధ్యే పలు వాదనలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో మస్క్ ఘాటుగా పోస్టు చేశారు. రిపబ్లికన్ పార్టీలోని ధిక్కరించే మూరు?లను తొలగించాలని పోస్టు పెట్టారు.

అమెరికా కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ జనవరిలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈలోపు పలు పదవులకు కొత్తవారిని నియమిస్తున్నారు. ఇప్పటివరకు ఐదుగురు భారత అమెరికన్లను కీలక పదవులకు ఎంచుకున్నారు. అయితే వారిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా వెంచర్ క్యాపిటలిస్ట్ శ్రీరామ్ కృష్ణన్‌ను ఎంచుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. నైపుణ్యం కలిగిన వలసదారుల కోసం గ్రీన్‌కార్డుల విషయంలో ఉన్న పరిమితులను తొలగించాలని గతంలో శ్రీరామ్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ మద్దతుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇది సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

ఎలాన్ మస్క్ హెచ్1బీ వీసా పైనే అమెరికాకు వలస వచ్చారు. టాలెంట్ ఎక్కడున్నా దానిని అందిపుచ్చుకోవాలని ఆయన ఎప్పుడూ చెప్తుంటారు. "మీ బృందం విజయం సాధించాలంటే.. అద్భుతమైన ప్రతిభ ఉన్న వ్యక్తులు ఎక్కడున్నా మన జట్టులో చేర్చుకోవాలి" అని ఓ సందర్భంలో అన్నారు. మస్క్ బాటలోనే వివేక్ రామస్వామి వాదన కూడా ఉంది. ఆయన కూడా భారత్ నుంచి వలసవచ్చిన కుటుంబంలో జన్మించారు. అమెరికా సంస్కృతిలో ఉన్న లోటుపాట్లను ఎత్తి చూపారు. ఆ లోపాల వల్లే పెద్ద సంస్థలన్నీ విదేశాల్లో జన్మించిన వారిని నియమించుకుంటున్నాయనే అర్థంలో విమర్శలు చేశారు.

మరోవైపు రిపబ్లికన్ పార్టీకి చెందిన నిక్కీ హేలీ భిన్నమైన వాదనను వినిపించారు. "నేను సౌత్ కరోలినా గవర్నర్‌గా పనిచేసిన సమయంలో నిరుద్యోగిత రేటు 11 శాతం నుంచి 4 శాతానికి పడిపోయింది. విదేశీ ఉద్యోగులను కాకుండా పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాం కాబట్టే అది సాధ్యమైంది. కొత్త ఉద్యోగాల కోసం ప్రజలకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు ఇప్పుడు విమానాలు, ఆటోమొబైల్స్ తయారీలో రాణిస్తున్నారు. సాంకేతికరంగాన్ని బలోపేతం చేయాలని భావిస్తే ముందు విద్యారంగంపై దృష్టిసారించాలి. అంతేకానీ అమెరికన్లను తక్కువ అంచనా వేయొద్దు" అని స్పష్టంగా తన అభిప్రాయాన్ని వినిపించారు. ఈనేపథ్యంలో మస్క్ పోస్టు పెట్టారు.





# టోకెన్లు ఉంటేనే తిరుమల రండి

- త్వరలో వైకుంఠ ద్వార సర్వ దర్శన టోకెన్లు రిలీజ్
- డయిల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఈవో జె.శ్యామల రావు
- సిఫార్సు లేఖ లు అనుమతించ బోమని వెల్లడి

తిరుమలః తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం నిర్వహించిన డయిల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఈవో జె.శ్యామల రావు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా టీటీడీ చేపట్టిన పలు కార్యకమా ల గురించి భక్తులకు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనం కొరకు భక్తులు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భక్తులకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేశామని చెప్పారు.వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 2025 జనవరి 10నుంచి 19వ తేదీ వరకు 10రోజుల పాటు భక్తులకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శ నం కొరకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. 10 రోజుల పాటు జరగనున్న వైకుంట ద్వార దర్శనం కోసం రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను డిసెంబరు 24న ఆన్లైన్లో 1.40 లక్షలు విడుదల చేశామని తెలిపారు. అంతేకాదు జనవరి 10న శ్రీవాణి దర్శన టికెట్లు 1500 రిలీజ్ చేసినట్లు.. మిగిలిన 9 రోజులకు 2000 టికెట్లు, గదుల కోటాను డిసెంబరు 23న ఆన్లైన్లో విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ టికెట్లను పొందిన భక్తులకు మహా లఘు దర్శనం ఉంటుందని అన్నారు.

**దాతలకు దర్శనం, బస :** ఆన్లైన్లో వైకుంఠ ద్వార దర్శనం బుక్ చేసుకున్న దాతలకు రూ.300ల ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు.సామాన్య భక్తుల సౌకర్యార్థం జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు దాతలకు గదుల కేటాయింపు ఉండదు. మిగతారోజుల్లో దాతలు యథావిధిగా గదులు బుక్ చేసుకోవచ్చని చెప్పారు. తిరుపతిలోని 8 కేంద్రాలలో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనం కోసం టోకెన్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి మొదటి మూడు రోజులకు జనవరి 9వ తేదీన ఉదయం 5 గం.ల నుంచి టోకెన్లు ఇవ్వనున్నామని.. 1.20 లక్షల టోకెన్లు జారీ చేస్తామని వెల్లడించారు. అయితే జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏ రోజుకా రోజు ముందు రోజు భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో టోకెన్లు జారీ చేస్తామని తెలిపారు.

**తిరుపతి, తిరుమలలో కౌంటర్లు :** భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కొరకు తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్లో టోకెన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం ఏర్పాటు చేస్తున్న కౌంటర్ల వద్ద భక్తులకు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయంలోనే తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోవిందమాల ధరించిన భక్తులు కూడా దర్శన టోకెన్లు పొంది దర్శనానికి రావాల్సి ఉంటుందని సూచించారు.

**స్వామివారి భక్తులకు విజ్ఞప్తి :** వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలనుకునే భక్తులకు సూచన ఏమిటంటే.. జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు అంటే ఈ పది రోజులు దర్శనటోకెన్లు ఉన్న భక్తులు మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి రావాలని సూచించారు. కేవలం టికెట్లు, లేదా టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తిరుమలకు ప్లాన్ చేసుకోవాలని కోరుతున్నారు.

**స్పెషల్ కోటా టికెట్లు రద్దు :** స్వామివారి దర్శనం కోసం వచ్చే చంటిపిల్లల తల్లిదండ్రులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బంది తదితర ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులపాటు రద్దు చేశారు. భక్తుల అధిక రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ 10 రోజులలో విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవని తెలిపారు. అయితే ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే వారికి మాత్రం శ్రీవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు.

## మన్మోహన్‌కు అవమానం

బిజేపి పై ట్విట్టర్ లో రాహుల్ గాంధీ విమర్శ లు



న్యూఢిల్లీ : అంత్య క్రియల సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ను బీజేపీ ప్రభుత్వం అవమానించిందని ) ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఇవాళ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు నిగంబోధ్ ఘాట్ వద్ద జరిగాయి. దీనిపై ప్రతిపక్ష నేత ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. బీజేపీపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా.. భారతమాత ముద్దుబిడ్డ, సిక్కు సమాజానికి మొదటి ప్రధాన మంత్రి అయిన డాక్టర్ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు నిగంబోధ్ ఘాట్ వద్ద నిర్వహించడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వం ఆయనను పూర్తిగా అవమానించిందని ఆరోపించారు. అలాగే ఆయన ఒక దశాబ్దం పాటు భారతదేశానికి ప్రధానమంత్రిగా ఉన్నాడని, ఆయన పదవీకాలంలో దేశం ఆర్థికంగా సూపర్ పవర్గా మారిందని, ఆయన విధానాలు ఇప్పటికీ దేశంలోని పేద, వెనుకబడిన తరగతులకు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. ఇక ఇప్పటి వరకు మాజీ ప్రధానులందరి గౌరవాన్ని గౌరవిస్తూ.. వారి అంతిమ సంస్కారాలు అధికారిక శ్మశానవాటికలో నిర్వహించబడ్డాయని, తద్వారా ప్రతి వ్యక్తి ఎటువంటి అసౌకర్యం లేకుండా చివరి చూపు చూసి, నివాళులు అర్పించారని అన్నారు. డా. మన్మోహన్ సింగ్ మన అత్యున్నత గౌరవం, స్మారకానికి అర్హుడని, దేశం గర్వించదగ్గ ఈ మహాపుత్రుడికి, ఆయన సమాజానికి ప్రభుత్వం గౌరవం చూపించి ఉండాల్సిందని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు.

# 2024లో నింగికెగిసిన ప్రముఖులు


## రతన్ టాటా నుంచి మన్మోహన్ సింగ్ వరకు



**2024 సంవత్సరం భారతదేశానికి ఎన్నో విషాదాలను మిగిల్చింది. వివిధ రంగాల్లో తమదైన ముద్ర వేసిన అనేక మంది ప్రముఖ వ్యక్తులు మనకు దూరమయ్యారు. వారి జీవితాలు, వారు అందించిన సేవలు మన మనసుల్లో ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయి. వారి గురించి ఓ సారి మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీరి గురించి కొంత విశ్లేషించుకుంటే....**

## కార్పొరేట్ రంగంలో రతన్ టాటా

టాటా సన్స్ మాజీ చైర్మన్ రతన్ టాటా ఈ ఏడాది అక్టోబర్ 9న మరణించారు. ఆయన నాయకత్వంలో టాటా గ్రూప్ ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగింది. ప్రపంచంలోనే దిగ్గజ వ్యాపారవేత్తల్లో ఒకరిగానే గాక.. నిత్య మార్గదర్శకుడిగా, దాతృత్వశీలిగా, మానవతావాదిగా పేరుగడించారు. దేశానికి ఎలాంటి సాయం అవసరమైనా అందించేందుకు రతన్ టాటా ముందుండేవారు కరోనా సమయంలోనూ దేశ ప్రజలకు సాయం అందించేందుకు రూ. 500 కోట్లు కేటాయించడం గమనార్హం. దేశంలో ఎక్కడ ఎలాంటి విపత్తు ఎదురైనా దేశ ప్రజల కోసం సాయం అందించేందుకు రతన్ టాటా ముందుండేవారు. కేవలం లాభం కోసమే కాకుండా దేశానికి ప్రయోజనం అందించేందుకే ఆయన వ్యాపారాలు చేయడం గమనార్హం. టాటా గ్రూప్ సంపదలో ఎక్కువ భాగం టాటా ట్రస్ట్ ద్వారా ధార్మిక కార్యక్రమాలకు కేటాయించేవారు.



## భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్

భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురువారం(డిసెంబర్ 26, 2024) రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1932, సెప్టెంబర్ 26, మన్మోహన్ సింగ్ ప్రస్తుతం పాకిస్థాన్లోని పంజాబ్ రాష్ట్రంలోని గాహ్లో జన్మించారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్లో డాక్టరేట్ పొందారు. కేంబ్రిడ్జ్ నుంచి పీజీ పట్టా పొందారు. ప్లానింగ్ కమిషన్ చీఫ్గా, ఎకనామిక్ అడ్వైజర్గా భారత ప్రభుత్వంలో కీలక పదవుల్లో పనిచేశారు. 1991లో తొలిసారి మన్మోహన్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఐదుసార్లు అసోం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1991-96 వరకు అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు మన్మోహన్ సింగ్. తొలి సిక్కు ఆర్థికమంత్రిగా ఆయన రికార్డుల్లోకెక్కారు. భారత ఆర్థిక ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా మన్మోహన్ సింగ్ ఘనత వహించారు.ఇక, 2004 నుంచి 2014 వరకు యూపీఏ హయాంలో భారత ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ సేవలందించారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చాయి. 2024లో ఆయన రాజ్యసభ సభ్యుడిగా పదవీ విరమణ చేశారు. పద్మవిభూషణ్ సహా అనేక అవార్డులు, పురస్కారాలను మన్మోహన్ అందుకున్నారు.

మన్మోహన్ సింగ్ ప్రజా సేవా జీవితంలో పొందిన అనేక పురస్కారాలు, గౌరవాలు ఉన్నాయి. అందులో ప్రముఖమైనవి భారతదేశపు రెండవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ విభూషణ్ (1987), జవహర్లాల్ నెహ్రూ జయంతి శతాబ్ది పురస్కారం (1995), ఆసియా మనీ అవార్డు ఫర్ ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ది ఇయర్ (1993-1994), యూరో మనీ అవార్డు ఫర్ ఫైనాన్స్ మినిస్టర్ ఆఫ్ ది ఇయర్ (1993), యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ ఆడమ్ స్మిత్ ప్రైజ్ (1956), సెంట్రల్ లండన్ లోని సెంట్ జాన్ కాలేజ్ ద్వారా ప్రదర్శనలో ప్రఖ్యాతి చెందిన రైట్ ప్రైజ్ (1955) ఉన్నాయి. అలాగే, పలు దేశాలు అత్యున్నత పురస్కారాలు కూడా అందుకున్నారు మన్మోహన్ సింగ్.



## కళా రంగంలో జాకీర్ హుస్సేన్

ప్రముఖ తబలా విద్వాంసుడు, గ్రామీ అవార్డు గ్రహీత జాకీర్ హుస్సేన్ డిసెంబర్ 15, 2024న అమెరికాలోని శాన్ఫ్రాన్సిస్కోలో కన్నుమూశారు. ఆయన తన సంగీతంతో లక్షలాది మంది హృదయాలను కొల్లగొట్టారు. 9 మార్చి 1951న ముంబైలో జన్మించిన జకీర్ హుస్సేన్.. 2023లో పద్మవిభూషణ్, మూడు గ్రామీ అవార్డులతో సహా అనేక ప్రశంసలను అందుకున్న ప్రముఖ సంగీతకారుడు. ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ సంగీత ప్రయాణం చిన్న వయస్సులోనే ప్రారంభమైంది. కేవలం 11 సంవత్సరాల వయస్సులో, ఆయన తన మొదటి సంగీత కచేరీని అమెరికాలో ప్రదర్శించారు. జకీర్ హుస్సేన్.. తొలి ఆల్బమ్, 'లివింగ్ ఇన్ ది మెటీరియల్ వరల్డ్,' 1973లో విడుదలైంది. జకీర్ హుస్సేన్ ప్రత్యేక ప్రతిభకు పేరుగాంచిన తవా, థాలీ వంటి వంటగది పాత్రలకు కూడా ఏదైనా చదునైన ఉపరితలాన్ని ఉపయోగించి లయల(సంగీతాన్ని)ను సృష్టిస్తారు. హుస్సేన్.. జార్జ్ హారిసన్ 1973 ఆల్బమ్ లివింగ్ ఇన్ ది మెటీరియల్ వరల్డ్, జాన్ హ్యాండీ 1973 ఆల్బమ్ హార్డ్ వర్క్లో భాగస్వామిగా ఉన్నారు. ఆయన వాన్ మోరిసన్ 1979 ఆల్బమ్ ఇన్టు ది మ్యూజిక్ అండ్ ఎర్త్, విండ్ అండ్ ఫైర్ 1983 ఆల్బమ్ పవర్లైట్లో కూడా ప్రదర్శన ఇచ్చారు.

## మీడియా రంగంలో రామోజీ రావు



మీడియా రంగంలో తనదైన ప్రత్యేక ముద్ర వేసిన ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు జూన్ 8న కన్నుమూశారు. మీడియా రంగంలో ఆయన ఎనలేని సేవలు అందించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈనాడు పత్రిక, ఈటీవీ చానళ్ల ద్వారా ప్రజలకు దగ్గరయ్యారు. ప్రజలకు, రైతులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను ఆయన తన మీడియా ద్వారా చేరవేశారు. విపత్తుల సమయంలో సేవా కార్యక్రమాలతో బాధితులకు అండగా నిలిచారు. ఉస్తాద్ రషీద్ ఖాన్: ప్రముఖ హిందుస్థానీ శాస్త్రీయ గాయకుడు ఉస్తాద్ రషీద్ ఖాన్ జనవరి 9, 2024న మరణించారు. ఆయన తన మధురమైన స్వరంతో అందరినీ అలరించారు.

## రాజకీయ రంగంలో సీతారాం ఏచూరి



: సీనియర్ రాజకీయ నాయకులు, సీపీఐ(ఎం) పొలిట్బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి సెప్టెంబర్ 12, 2024న కన్నుమూశారు. ఆయన తన జీవిత కాలం అంతా కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి, కార్మికుల హక్కుల కోసం పోరాడారు. ఆయనకు తెలుగు రాష్ట్రాలతో ప్రత్యేక అనుబంధం ఉంది. కాలమిస్టుగా, ఆర్థికవేత్తగా, సామాజిక కార్యకర్తగా గుర్తింపు పొందిన ఏచూరి 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. సీపీఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా 1992 నుంచి కొనసాగారు. తొలిసారిగా 1974లో ఎస్ఎఫ్ఐలో చేరి 1975లో సీపీఎం ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నారు. 1984లో సీపీఎం కేంద్ర కమిటీకి ఎంపికయ్యారు.





## ‘పంత్.. నువ్వొక స్టుపిడ్’.. : సునీల్ గవాస్కర్

గత ఆస్ట్రేలియా పర్యటనలో గబ్బాలో రిషబ్ పంత్ ఆడిన చిరస్మరణీయ ఇన్నింగ్స్ అందరికీ గుర్తుంటుంది. తన మెరుపు ఇన్నింగ్స్ తో టీమ్ ఇండియాకు విజయాన్ని అందించిన రిషబ్ పంత్.. సిరీస్ గెలవడంలోనూ కీలక పాత్ర పోషించాడు. దీంతో ఈ టూర్‌లోనూ పంత్ నుంచి అదే విధమైన ప్రదర్శన ఆశించారు. అయితే ఇప్పటి వరకు జరిగిన నాలుగు టెస్టు మ్యాచ్‌ల్లో పంత్ ఒక్క మంచి ఇన్నింగ్స్ కూడా ఆడలేదు. ఆడిన అన్ని ఇన్నింగ్స్‌ల్లోనూ అనవసర షాట్లు ఆడుతూ వికెట్లు సమర్పించుకుంటున్నాడీ డ్యాషింగ్ ప్లేయర్. ప్రస్తుతం జరుగుతున్న 4వ టెస్టు మ్యాచ్‌లోనూ పంత్ అదే బాధ్యతా రహితమైన షాట్‌ను ఆడి పెవిలియన్ కు చేరుకున్నాడు. ఇది జట్టును ఇబ్బందుల్లోకి నెట్టడమే కాకుండా, కామెంటేటర్ గా వ్యవహరిస్తోన్న దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్‌కు కోపం తెప్పించింది. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ 37 బంతుల్లో 28 పరుగులు మాత్రమే చేయగలిగాడు. జట్టుకు అవసరమైన సమయంలో పంత్ అనవరసర స్కూప్ షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. అంతకు ముందు బంతిని కూడా ఫైన్ లెగ్ మీదుగా పిక్-అప్ ర్యాంప్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ సక్సెస్ కాలేదు. ఆ తర్వాతి బంతితోనూ అదే ప్రయత్నం చేసిన పంత్ మళ్లీ ర్యాంప్ షాట్ ఆడాడు. కానీ బంతి బ్యాట్ అంచుకు తగిలి డీప్ థర్డ్ మ్యాన్ వద్ద నిలబడి ఉన్న నాయన్ లియాన్ వద్దకు వెళ్లింది.

రిషబ్ పంత్ ఆడిన ఈ బాధ్యతారహిత షాట్‌ని చూసిన సునీల్ గవాస్కర్ లైవ్ మ్యాచ్‌లోనే ఆగ్రహం వ్యక్తం చేశాడు. పరుష పదజాలంతో పంత్ పై విరుచుకు పడ్డాడు. ‘ఇద్దరు ఫీల్డర్లు డీప్ థర్డ్ మ్యాన్ వద్ద నిలబడి ఉన్నప్పుడు అలాంటి షాట్ ఎలా ఆడతారు. ఆఖరి బంతితోనూ అదే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. మరోసారి అదే షాట్ ఆడి వికెట్ సమర్పించుకున్నావు. ఇది మీ సహజమైన ఆట అని చెప్పలేము. ఇది మీ గేమ్ ఏ మాత్రం కాదు. పరిస్థితిని అర్థం చేసుకుని షాట్ సెలెక్షన్ చేసుకోవాలి’ అని పంత్ పై మండిపడ్డాడు సన్నీ. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.



# ముగిసిన మూడో రోజు ఆట..

## టెస్టు కెరీర్‌లో నితీష్ రెడ్డి.. తొలి సెంచరీ..


భారత్ ఆస్ట్రేలియా 5 మ్యాచ్‌ల బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో నాలుగో మ్యాచ్ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతోంది. వర్షం, బ్యాడ్ లైట్ కారణంగా మూడో రోజు ఆట ముగిసింది. ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్ లో 474 పరుగులకు అల్ అవుట్ అవ్వగా.. ఇక మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. నితీష్ రెడ్డి సెంచరీతో అదరగొట్టగా.. 10 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 105 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు. మరోవైపు మహ్మద్ సిరాజ్ క్రీజ్ లో ఉన్నాడు. ఇక మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు కంటే భారత్ ఇంకా 116 పరుగులు వెనుకబడి ఉంది. నితీష్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ మధ్య 8వ వికెట్‌కు రికార్డ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. దీని సహాయంతో ఫాలో ఆన్‌ను నివారించడంలో టీమ్ ఇండియా విజయం సాధించింది. ఇక టీమిండియా బ్యాట్సమెన్ సుందర్ 162 బంతుల్లో 50 పరుగులు చేసి నితీష్ రెడ్డికి మంచి తోడ్పాటును అందించాడు.

164/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియాకు శుభారంభం లభించలేదు. దూకుడుగా ఆడిన రిషభ్ పంత్ (28) స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో అనవసరమైన షాట్ ఆడుతూ క్యాచ్ ఔటవ్వడంతో పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత 8వ స్థానంలో క్రీజులోకి నితీష్ కుమార్ రెడ్డి వచ్చాడు. రవీంద్ర జడేజా ఆచితూచి ఆడే ధోరణి అనుసరించాడు. జడేజా నెమ్మదిగా ఆడుతున్నప్పటికీ, నితీష్ తనదైన శైలిలో పరుగులు సాధించాడు. క్రీజులో స్థిరపడుతున్న ఈ భాగస్వామ్యాన్ని నాథన్ లయన్ చెరిపి చేశాడు. జడేజాను వికెట్ల ముందు ఎల్బీడబ్ల్యూ చేసి వెనక్కి పంపించాడు. జడేజా ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్‌తో కలిసి నితీష్ రెడ్డి ఆకట్టుకునే బ్యాటింగ్ ప్రదర్శన చేశాడు. దీంతో లంచ్ బ్రేక్ సమయానికి టీమిండియా 244/7 స్కోర్ అందుకుంది.

ఇక ఆ తర్వాత రెండో సెషన్ ప్రారంభంలోనే నితీష్ కుమార్ రెడ్డి 81 బంతుల్లో అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. హాఫ్ సెంచరీ సాధించిన అనంతరం పుష్ప ట్రేడ్‌మార్క్ “తగ్గేదేలే” స్టైల్‌లో సెలెబ్రేట్ చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అర్ధశతకానికి తర్వాత కూడా తన దూకుడును కొనసాగించిన నితీష్, మరింత మెరుగైన ప్రదర్శన చేశాడు. అయితే, ఈ సమయంలో వర్షం కారణంగా ఆటకు తాత్కాలిక విరామం ఏర్పడింది. వాతావరణం మెరుగుపడిన తర్వాత ఆట మళ్లీ ప్రారంభమైంది. నితీష్ అదే దూకుడును కొనసాగించగా, మరోవైపు వాషింగ్టన్ సుందర్ తన సుదీర్ఘ టెస్ట్ బ్యాటింగ్ నైపుణ్యంతో నితీష్‌కు మద్దతుగా నిలిచాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో భారత్ 326/7తో టీ బ్రేక్‌కు చేరుకుంది. ఆపై మూడో సెషన్‌లో నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ జోడీ క్రీజులో చాలా నెమ్మదిగా ఆడారు. వాషింగ్టన్ సుందర్ తన సుదీర్ఘ ఇన్నింగ్స్‌లో 146 బంతుల్లో కేవలం ఒక ఫోర్ సాయంతో అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు, నితీష్ సెంచరీకి చేరువయ్యాడు. అయితే నితీష్ 96 పరుగుల వద్ద ఉండగా, నాథన్ లయన్ వేసిన అనూహ్య బౌన్స్ డెలివరీకి వాషింగ్టన్ సుందర్ స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. దాంతో 8వ వికెట్‌కు 117 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.ఆ తర్వాత క్రీజులోకి బుమ్రా రావడంతో నితీష్ కుమార్ రెడ్డి సింగిల్స్ తీసుకుంటూ 99 పరుగుల మైలురాయిని చేరాడు. అయితే ఈ దశలో ప్యాట్ కమిన్స్ బౌలింగ్‌లో బుమ్రా(0) ఔటవ్వడంతో నితీష్ శతకంపై ఉత్కంఠ మరింత పెరిగింది. అనంతరం క్రీజులోకి వచ్చిన మహ్మద్ సిరాజ్ మూడు బంతులను నెమ్మదిగా ఆడి, నితీష్‌కు స్ట్రైక్ ఇచ్చాడు. స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో నితీష్ మొదటి రెండు బంతులను డిఫెన్స్ చేసి, మూడో బంతిని మాత్రం బౌండరీకి తరలించి 171 బంతుల్లో తన తొలి టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఇక నితీష్ శతకాన్ని చూసిన అతని తండ్రి గ్రౌండ్ లోనే ప్రేక్షకుల మధ్య ముత్యాల రెడ్డి ఆనందభరిత భావోద్వేగానికి లోనయ్యాడు.

## సెంచరీతో అదరగొట్టిన నితీష్ రెడ్డి..

# సీఎం చంద్రబాబు అభినందనలు







**కంగ్రాట్స్ నితీశ్..**

**మూడో భారత ప్లేయర్‌గా ఘనత సాధించావు :** తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి ఆసీస్‌పై సెంచరీ చేశాడు. మెల్‌బోర్న్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో అలరించాడు. క్లిష్టపరిస్థితుల్లో సెంచరీ చేసిన నితీశ్‌పై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా అభినందించారు.

**తొలి శతకం.. నితీశ్ ముత్యాలరెడ్డి ఏమన్నారంటే?**

“బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా జరుగుతోన్న నాలుగో టెస్టులో నితీశ్ సెంచరీ సాధించాడు. విశాఖపట్నం యువకుడు శతకం చేయడం అభినందనీయం. ఆసీస్ గడ్డపై అతిపిన్న వయసులో సెంచరీ చేసిన మూడో భారత ఆటగాడిగా ఘనత సాధించడం సంతోషం కలిగిస్తోంది.

రంజీలోనూ ఆంధ్రా తరఫున ఎన్నో విజయాలు సాధించాడు. అండర్ -16 నుంచే అద్భుత ప్రదర్శన ఇస్తున్నాడు.

భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని.. భారత జట్టులో కొనసాగి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా” అని చంద్రబాబు పోస్టు పెట్టారు.

**టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ..**

**టాప్ స్కోరర్‌గా నిలిచిన నితీశ్**

“విశాఖ కుర్రాడు నితీశ్ ఆసీస్‌పై సెంచరీ చేయడం చూసి ఆనందించా. తీవ్ర ఒత్తిడిలోనూ ఏకాగ్రతను కోల్పోకుండా తొలి శతకం పూర్తి చేసినందుకు అభినందనలు. నితీశ్ ఆటపై గర్వంగా ఉంది. ఇలానే ముమ్ముందూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఈ సంవత్సరం గుర్తుండిపోయేలా చేసినందుకు ధన్యవాదాలు. కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ఒక్కో అడుగు ముందుకేస్తూ స్వర్ణాంధ్ర దిశగా సాగిపోదాం” అని నారా లోకేశ్ పోస్టు చేశారు.

**సచిన్, పంత్ తర్వాత..**

ఆస్ట్రేలియాలో అతిపిన్న వయస్సులో సెంచరీ సాధించిన మూడో భారత బ్యాటర్‌గా నితీశ్ నిలిచాడు.

1992లో సచిన్ తెందూల్కర్ (18 ఏళ్ల 256 రోజులు), 2019లో రిషభ్ పంత్ (21 ఏళ్ల 92 రోజులు) శతకం సాధించి ముందున్నారు.

ఇప్పుడు నితీశ్ రెడ్డి 21 ఏళ్ల 216 రోజుల వయసులో మెల్‌బోర్న్ వేదికగా సెంచరీ బాదాడు.

# చాలా టెన్షన్‌కు గురయ్యా..



- సెంచరీ తర్వాత నితీష్ రెడ్డి తండ్రి భావోద్వేగం..
- టెస్టు క్రికెట్‌లో నితీష్ తొలి అడుగు
- భారత్‌కు ట్రబుల్‌షూటర్ పాత్ర
- సెంచరీపై స్పందించిన నితీష్ రెడ్డి తండ్రి

టెస్టు క్రికెట్‌లో తొలి అడుగు వేసిన నితీష్ కుమార్ రెడ్డి.. భారత్‌కు ‘ట్రబుల్‌షూటర్’ పాత్ర పోషించాడు. నాలుగో టెస్టు మూడో రోజు సెంచరీతో ఆస్ట్రేలియా విజయ ఆశలపై నీళ్లు చల్లాడు. నితీష్ చేసిన105 పరుగుల చేశాడు. వర్షం కారణంగా మూడో రోజు ఆట త్వరగా ముగిసింది. ఈ నేపథ్యంలో భారత్ తొమ్మిది వికెట్లకు 358 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోరు 474 పరుగులు.. అంటే భారత్ ఇంకా 116 పరుగులు చేయాల్సి ఉంది.

నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ సందర్భంగా ఆసీస్ మాజీ ఆటగాడు ఆడమ్ గిల్‌క్రిస్ట్ నితీష్ తండ్రి ముత్యాల రెడ్డితో సంభాషించాడు. ఈ సందర్భంగా ముత్యాల రెడ్డి మాట్లాడుతూ.. తమ కుటుంబానికి ఇదొక ప్రత్యేకమైన రోజని సంతోషం వ్యక్తం చేశారు. తమ జీవితంలో ఈ రోజును అస్సలు మరిచిపోలేమన్నారు.

“నితీష్ 14 ఏళ్ల నుంచే క్రికెట్ ఆడుతున్నాడు. చాలా బాగా ఆడటం మొదలు పెట్టాడు. నా కుమారుడు చేసిన సెంచరీని ప్రత్యక్షంగా చూడటం మాటల్లో చెప్పలేపోతున్నాను. నితీష్ 99 పరుగుల చేసి క్రీజ్‌లో ఉన్నప్పుడు ఎంతో టెన్షన్ పడ్డాను. ఒక్క వికెట్ మాత్రమే మిగిలింది. సిరాజ్ కూడా బాగా ఆడాడు. ఎట్టకేలకు నా కుమారుడు సెంచరీ సాధించడం ఆనందంగా ఉంది” అని భావోద్వేగానికి గుయ్యారు.

ఇదిలా ఉండగా.. భారత్ ఆస్ట్రేలియా 5 మ్యాచ్‌ల బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో నాలుగో మ్యాచ్ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతోంది. వర్షం, బ్యాడ్ లైట్ కారణంగా మూడో రోజు ఆట ముగిసింది.

ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్ లో 474 పరుగులకు అల్ అవుట్ అవ్వగా.. ఇక మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. నితీష్ రెడ్డి సెంచరీతో అదరగొట్టగా.. 10 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 105 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు. మరోవైపు మహ్మద్ సిరాజ్ క్రీజ్ లో ఉన్నాడు.

ఇక మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు కంటే భారత్ ఇంకా 116 పరుగులు వెనుకబడి ఉంది.

# దీప్తి శర్మ ఆల్‌రౌండర్ షో

- వెస్టిండీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా
- 5 వికెట్ల తేడాతో టీమిండియా విజయం
- సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్





టీమిండియా, వెస్టిండీస్ మహిళల మధ్య వడోదరలో జరిగిన వన్డే సిరీస్ మూడో మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఓడించి, సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఈ మ్యాచ్‌లో మొదట బౌలింగ్ చేసిన భారత జట్టు, వెస్టిండీస్‌ను కేవలం 162 పరుగులకే కట్టడి చేసింది. ఆ తరువాత, భారత బ్యాట్స్‌మెన్ ఈ సులభమైన లక్ష్యాన్ని కేవలం 28.2 ఓవర్లలో ఛేదించారు. దీప్తి శర్మ ఈ మ్యాచ్‌లో అటు బౌలింగ్ లో, ఇటు బ్యాటింగ్ లో అద్భుతమైన ప్రదర్శనను కనబరిచింది. దాంతో ఆమెను ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అందుకుంది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే భారత బౌలర్లు రేణుకా సింగ్ ఠాకూర్, దీప్తి శర్మలు వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేసి, జట్టు మొత్తాన్ని 162 పరుగులకే పరిమితం చేశారు. మొదటి బంతికే వెస్టిండీస్‌కు రేణుకా షాక్ ఇచ్చింది. 9 పరుగుల వద్ద మూడో వికెట్ పడగొట్టిన రేణుకా ఆ తర్వాత కరీబియన్ జట్టును కంట్రోల్ చేయడం కొనసాగించింది. ఆ తర్వాత దీప్తి శర్మ మిగిలిన వికెట్లను వరుసబెట్టి 10 ఓవర్లలో 31 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టింది.ఇక భారత బ్యాటింగ్ ప్రారంభంలో కొన్ని వికెట్లు కోల్పోయినప్పటికీ, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (32), జెమిమా రోడ్రిగ్స్ (29) నెమ్మదిగా పరుగులు సాధించారు. దీప్తి శర్మ 48 బంతుల్లో 39 పరుగులు చేసి, రిచా ఘోష్ 11 బంతుల్లో 23 పరుగులు చేసిన తర్వాత భారత్ ఈ లక్ష్యాన్ని 28.2 ఓవర్లలోనే ఛేదించింది. ఈ మ్యాచ్ తో భారత్-వెస్టిండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్ ముగిసింది. ఈ సిరీస్‌లో భారత్ మూడు మ్యాచ్‌లలో విజయం సాధించింది. మొదటి మ్యాచ్‌లో భారత్ 211 పరుగుల తేడాతో, రెండో మ్యాచ్‌లో 115 పరుగుల తేడాతో విజయం సాధించగా, మూడో మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రేణుకా సింగ్ ఠాకూర్ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో మొత్తం 10 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికయ్యారు. ఇదిలా ఉంటే, 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో కూడా భారత్ వెస్టిండీస్‌పై 3-0తో క్లీన్ స్వీప్ చేసింది.




# ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా సూర్య ముందడుగు

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**
**సూర్య దినపత్రిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించిన కేంద్రమంత్రి**
**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా సూర్య దినపత్రిక తన వారసత్వాన్ని కొనసాగిస్తూ ముందుకు కొనసాగుతుందని, దానిని కొనసాగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సూర్య దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ - 2025 ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలోని లోపాలను ప్రజలకు ప్రభుత్వం చేయాల్సిన పనులను పత్రికలో వార్తలుగా రాస్తూ సూర్య దినపత్రిక ముందుకు సాగుతుందన్నారు. అదే ఒరవడిని కొనసాగిస్తూ మిగతా పత్రికలకు ఆదర్శంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా వారి అభివృద్ధి కోసం సూర్య దినపత్రిక తన వార్తల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ పత్రిక ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో ఇన్చార్జి , బ్రాంచ్ మేనేజర్ బోనాల వెంకటేష్, హుజురాబాద్ ఆర్సి ఇంచార్జ్ పరాంకుశం కిరణ్ కుమార్, మానకొండూర్ రిపోర్టర్ గణేష్, వీనవంక రిపోర్టర్ రజాక్ ,ఫోటోగ్రాఫర్ రంజిత్ , తిమ్మాపూర్ రిపోర్టర్ శాంతి కుమార్, కొత్తపల్లి రిపోర్టర్ రాజశేఖర్, హుజురాబాద్ రూరల్ రిపోర్టర్ హరిప్రసాద్, డెస్క్ ఇంచార్జ్ జనార్ధన్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# సూర్య సినిమా



ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన సూర్య -2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎ. తమీమ్ అన్సరియా

## జనవరి3న వచ్చేస్తున్న 'పా.. పా..'

తమిళ బ్లాక్ బస్టర్ మూవీ 'డా..డా' మూవీ తెలుగులో 'పా.. పా..' టైటిల్‌తో జెకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై, నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. జనవరి 3న ఈ మూవీ ఆంధ్ర, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల డైరెక్టర్ మారుతి విడుదల చేసిన 'పా.. పా..' మూవీ ట్రైలర్‌కు భారీ రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. గత ఏడాది తమిళంలో విడుదలైన 'డా..డా' మూవీ సెన్సేషనల్ హిట్ సాధించింది. కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా, డైరెక్టర్ గణేష్ కె బాబు తెరకెక్కించిన 'డా..డా' చిత్రం తమిళ ఆడియన్స్‌ని విపరీతంగా ఆకట్టుకుంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్‌లకు కాసుల వర్షం కురిపించింది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా సుమారు 30 కోట్లు వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసుకుంది. హార్ట్ టచ్ అయ్యే పాటలు ఈ సినిమాకు మరో హైలైట్ అని చెప్పుకోవచ్చు. ఒకప్పటి పాపులర్ సాంగ్స్ మాదిరిగానే ఈ సినిమా పాటలు స్థిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది.



## "నింద"కి అంతర్జాతీయ స్ట్రీమింగ్ కి ఆమోదం



వరుణ్ సందేశ్ హీరోగా వచ్చిన థ్రిల్లర్ నింద ఇప్పటికీ ట్రెండ్ అవుతూనే ఉంది. ఈ చిత్రం ఇప్పుడు ఎమిరేట్స్, మలేషియన్ ఎయిర్‌లైన్స్‌లో ప్రసారం చేయడానికి ఆమోదించారు. దీంతో అంతర్జాతీయ ప్రేక్షకులకు విస్తరించబోతోంది. సెప్టెంబర్ 6న ఈటీవీ విన్‌లో విడుదలైనప్పటి నుంచీ ట్రెండ్ అవుతున్న ఈ మూవీ ఇప్పటికే 35 మిలియన్లకు పైగా స్ట్రీమింగ్ మినిట్స్ క్రాస్ చేసింది. యదార్థ సంఘటనల ఆధారంగా నింద మూవీని ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ జగన్నాధం దర్శకత్వం వహించి, నిర్మించారు. గ్రిప్పింగ్ కథనంతో అందరినీ ఆకట్టున్నారు. ఈ సినిమాలో అన్నీ, శ్రేయ, తనికెళ్ల భరణి, భద్రం వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు.

## గోదారి గట్టుకి 50 మిలియన్ వ్యూస్



విక్టరీ వెంకటేష్ హైలీ యాంటిసిపేటెడ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా చుట్టూ ఎక్సయిట్మెంట్ నెక్స్ట్ లెవెల్ చేరుకుంది. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ సంక్రాంతి కానుకగా జనవరి 14న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సినిమా ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్‌తో సంచలనం సృష్టించింది, మొదటి రెండు పాటలు సెన్సేషనల్ హిట్‌గా నిలిచాయి. వెరీ ట్యాలెంటెడ్ భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ గోదారి గట్టు సాంగ్ రమణ గోగుల మధు ప్రియ ప్లజెంట్ వోకల్స్, భాస్కరభట్ల ఆకట్టుకునే సాహిత్యంతో మెస్మరైజింగ్ మెలోడీగా నిలిచింది. వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ మధ్య బ్యూటీఫుల్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేసే పాట ఫ్యాన్స్ లో ఇన్‌స్టెంట్ ఫేవరేట్ హిట్‌గా నిలిచింది. గోదారి గట్టు వెంకటేష్ కెరీర్‌లో ఫాస్టెస్ట్ రికార్డ్ సాధించింది, సీనియర్ హీరోలలో కేవలం3 వారాల్లోనే 50 మిలియన్ వ్యూస్‌ను రీచ్ అయిన ఫాస్టెస్ట్ సాంగ్‌గా నిలిచింది. ఈ ట్రాక్ పాపులారిటీ సోషల్ మీడియా సంచలనంగా మార్చింది, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో, అభిమానులు, ఇన్ఫ్లుయెన్సర్స్ రొమాంటిక్ నంబర్‌పై వారి వోన్ టేక్‌ని షేర్ చేస్తున్నారు.

## గోల్డెన్ స్టార్ గణేష్ తో కోలాబ్రెట్ అయిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ

శాండల్‌వుడ్ గోల్డెన్ స్టార్ గణేష్, తన మూవీ కృష్ణం ప్రణయ సఖి-ఇటీవల 100 రోజులు జరుపుకున్న థియేట్రికల్ బ్లాక్‌బస్టర్ విజయంతో దూసుకుపోతున్నాడు. ఇప్పుడు ఆయన తన అభిమానులకు ఎక్సయిటింగ్ వార్తను అందించారు. గణేష్ అప్ కమింగ్ కన్నడ చిత్రం చ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ49 కోసం ప్రతిష్టాత్మకమైన తెలుగు నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కోలాబ్రెట్ అవుతున్నారు. కార్తికేయ 2, వెంకీ మామ, ఓ బేబీ, ధమాకా న్యూ-సెన్స్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌లను అందించిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెలుగు చిత్ర పరిశ్రమకు గణనీయమైన సహకారం అందించింది. చపీపుల్ మీడియా ఫ్యాక్టరీ49తో, వారు గణేష్ లీడ్ రోల్‌లో గొప్ప సినిమాటిక్ ఎక్సపీరియన్స్ అందించడం ద్వారా కన్నడ సినిమా పట్ల తమ నిబద్ధతను చాటారు. టీజీ విశ్వ ప్రసాద్ నేతృత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ హై క్యాలిటీ స్టోరీ టెల్లింగ్, అత్యాధునిక నిర్మాణం ద్వారా కన్నడ సినిమాను మరో లెవల్‌కి తీసుకువెళ్ళడానికి అంకిత భావంతో ఉన్నారు.



## 'మ్యాడ్ స్క్వేర్' నుండి రెండవ గీతం



'మ్యాడ్ స్క్వేర్' చిత్రం కోసం తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 2023లో విడుదలైన మ్యాడ్ మొదటి భాగం సంచలన విజయం సాధించడంతో, కేవలం ప్రకటనతోనే రెండవ భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా 'మ్యాడ్ స్క్వేర్' ప్రచార చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా 'మ్యాడ్' విజయంలో సంగీతం కీలక పాత్ర పోషించింది. దీంతో 'మ్యాడ్ స్క్వేర్' పాటలపై ప్రేక్షకుల్లో ఎంతో ఆసక్తి ఉంది. 'లడ్డు గాని పెళ్లి' అంటూ ఈ చిత్రం నుంచి విడుదలైన మొదటి గీతంకి విశేష స్పందన లభించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'స్వాతి రెడ్డి' అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్ర బృందం. 'లడ్డు గాని పెళ్లి' తరహాలోనే విన్న వెంటనే కట్టిపడేసేలా ఎంతో ఉత్సహంగా ఈ గీతం సాగింది. మొదటి భాగంలో 'కళ్ళజోడు కాలేజ్ పాప' వంటి బ్లాక్ బస్టర్ పాటతో ఒక ఊపు ఊపిన భీమ్స్ సిసిరోలియో, 'స్వాతి రెడ్డి'తో మరోసారి తన సత్తా చాటారు. రాబోయే రోజుల్లో ఈ పాట తెలుగునాట ఒక ఊపు ఊపడం ఖాయంగా చెప్పవచ్చు.

## "డ్రింకర్ సాయి" యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణ పొందడం సంతోషం - మూవీ టీమ్



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరో యిన్లుగా నటించిన సినిమా "డ్రిం కర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ నెల 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన "డ్రింకర్ సాయి" సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో విడుదలైన అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. "డ్రింకర్ సాయి" సినిమా సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ - నేను ఈ మూవీకి ప్రొడ్యూసర్ అయినా ఫస్ట్ టైమ్ మీడియా ముందుకు వస్తున్నాను. భారత సేవా సహకార ఫోరమ్ అనే సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నా. లాక్ డౌన్ లో నేను చేసిన సేవలకు మాస్క్ మ్యాన్ ఆఫ్ ఇండియా అనే అవార్డ్ వచ్చింది. పద్మశ్రీ పురస్కారానికి ఫైనల్ లిస్ట్ దాకా నా పేరు వెళ్లింది. ఇలాంటి నేపథ్యమున్న నేను డ్రింకర్ సాయి టైటిల్ తో సినిమా చేసినప్పుడు కొందరు మిత్రులు సందేహాలు వెలిబుచ్చారు. కానీ ఈ సినిమా ద్వారా ఒక మంచి సందేశాన్ని ఇస్తున్నామని వారికి చెప్పాను. మంత్రి శ్రీధర్‌బాబు మా మూవీ పోస్టర్ లాంఛ్ చేశారు. డ్రింకర్ సాయి సినిమాకు మంచి వసూళ్లు వస్తున్నాయి. మేము పెట్టిన పెట్టుబడి సేఫ్ అయ్యింది. లాభాలు కూడా వస్తాయి. అయితే వీటన్నింటికంటే ఒక మంచి సందేశాత్మక సినిమా చేశామనే సంతృప్తి ఉంది. డైరెక్టర్ కిరణ్‌ను సెట్‌లో చూశాను. ఎంతో డెడికేటెడ్‌గా, ప్రతిభావంతంగా పనిచేశాడు అన్నారు.

## జ్ఞానేశ్వరి అందం అదరహో

టాలీవుడ్ క్యూట్ బ్యూటీ, వైజాగ్ అమ్మాయి జ్ఞానేశ్వరి కండ్రేగుల గురించి అందరికీ తెలిసిందే. పెళ్లి చూపులు షోతో మంచి పాపులారిటీ సొంతం చేసుకున్న ఆమె.. ఫుల్ ఫేమస్ అయ్యారు. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ అటు సినిమాల్లో.. ఇటు వెబ్ సిరీసులతో బిజీగా ఉన్న జ్ఞానేశ్వరి.. సోషల్ మీడియాలో చేసే సందడి మాములుగా ఉండదు. నెట్టింట ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే జ్ఞానేశ్వరి.. తన పర్సనల్ విషయాలతో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలు అభిమానులతో పంచుకుంటూ ఉంటారు.




తరచూ తన గ్లామర్ పిక్స్ పోస్ట్ చేస్తూ కుర్రకారును హీటెక్కిస్తుంటారనే చెప్పాలి. తన వయ్యారంతో మైమరిపించే అమ్మడు.. సెగలు రేపుతుంటారు. తాజాగా ముద్దుగుమ్మ ఇన్ స్టాగ్రామ్ లో అదిరిపోయే పిక్స్ షేర్ చేయగా.. ఒక్కోటి ఒక్కో జెమ్. అందాల ఆరబోత అంటే అదే అన్నట్లు పోజులిచ్చారు జ్ఞానేశ్వరి. స్కిన్ టైట్ ఫిట్ డ్రెస్సుల్లో సందడి చేసిన జ్ఞానేశ్వరి ఇచ్చిన ఎక్స్ప్రెషన్స్ మాములుగా లేవు. ఎవరైనా కచ్చితంగా ఫిదా అవ్వాల్సిందే. ప్రస్తుతం ఆమె పిక్స్ వైరల్ గా మారాయి. మోడ్రన్ డ్రెస్ లో అమ్మడు తన థైస్ షోతో సింపుల్ గా అగ్గిరాజేశారు. మిర్రర్ ముందు కొంటెగా చూస్తూ పోజులిచ్చిన ఆమె.. తన గ్లామరస్ స్కిన్ తో ఫిదా చేసేశారు. కొత్త కొత్త స్టిల్స్ తో అదరగొట్టిన బ్యూటీ.. తన నవ్వుతో మైండ్ బ్లాక్ చేయడం పక్కా. బాత్ టబ్ లో పిక్ అయితే వేరే లెవెల్. ఓవరాల్ గా ప్రతి పిక్ కూడా సూపరే. దీంతో నెటిజన్లు ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. ఫొటోస్ సూపర్ అని చెబుతున్నారు. లైకులు కొడుతూ.. కామెంట్స్ పెడుతూ.. షేర్ చేస్తూ రచ్చ రచ్చ చేస్తున్నారు.

# 2024 డిజాస్టర్ దర్శకులు


**టాలెంటెడ్ దర్శకులుగా గుర్తింపు తెచ్చుకొని తరువాత ఒక్క ఫ్లాప్ తో కెరియర్ పరంగా ఇబ్బందులు ఎదురుకొన్న వారు ఇండస్ట్రీలో చాలా మంది ఉంటారు. అలాంటి దర్శకులు మళ్ళీ తమ టాలెంట్ ని ప్రూవ్ చేసుకోవడానికి ఒక్క మూవీ కోసం వెయిట్ చేస్తారు. నెక్స్ట్ చేసే సినిమాలతో బలమైన సక్సెస్ లు అందుకుంటారు. వారి పని అయిపోయింది అని విమర్శలు ఎదుర్కొని, ఆ తరువాత బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న డైరెక్టర్స్ చాలా మంది ఉన్నారు.**





కెరియర్‌లో డిజాస్టర్‌లు అందుకొని ఈ సారి బలమైన హిట్ కొట్టాలని కసిగా వర్క్ చేస్తున్న దర్శకుల నుంచి ఈ ఏడాది సినిమాలు రాబోతున్నాయి. అవన్నీ పాన్ ఇండియా రేంజ్ ప్రాజెక్ట్ లే కావడం విశేషం. వరుసగా నాలుగు హిట్స్ అందుకొని మెగాస్టార్ చిరంజీవితో ఆచార్య మూవీ చేసి బిగ్గెస్ట్ డిజాస్టర్ ని ఖాతాలో వేసుకున్న దర్శకుడు కొరటాల శివ. ఈ మూవీతో అతను చాలా విమర్శలు ఎదుర్కొన్నారు. అయితే తారక్ అతని టాలెంట్ ని నమ్మి ఏడాది పాటు వెయిట్ చేసి దేవర ప్రాజెక్ట్ ని పట్టాలెక్కించారు. 300 కోట్లకి పైగా బడ్జెట్ తో దేవర మూవీ పాన్ ఇండియా లెవల్ లో తెరకెక్కుతోంది. కంప్లీట్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమాని కొరటాల శివ సిద్ధం చేస్తున్నారు. పబ్లిక్ లో కూడా సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. దేవరతో కచ్చితంగా బ్లాక్ బస్టర్ కొట్టాలని కొరటాల కసిగా పనిచేస్తున్నారు. ఈ సినిమాను అక్టోబర్ లో విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తో పాన్ ఇండియా రేంజ్ లో సాహో మూవీ చేసిన యంగ్ డైరెక్టర్ సుజిత్ డిజాస్టర్ అందుకున్నారు. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా నార్త్ లో ఓ మోస్తరుగా ఆడినా తెలుగులో ఫ్లాప్ అయ్యింది. అయితే ఈ సారి కచ్చితంగా పాన్ ఇండియా లెవల్ లో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకోవాలని పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో ఓజీ మూవీ చేస్తున్నారు. రోబో 2.ఓతో డిజాస్టర్ అందుకున్న కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్. రోబో 2.ఓ తర్వాత శంకర్ సుదీర్ఘ గ్యాప్ తీసుకున్నారు. ఈ ఏడాది కచ్చితంగా సూపర్ హిట్ అందుకోవాలని తమిళంలో ఇండియన్ 2, తెలుగులో గేమ్ చేంజర్ తో శంకర్ తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు. నానితో అంటే సుందరానికి మూవీతో ఫ్లాప్ అందుకున్న యంగ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ. ఆ మూవీ తర్వాత చాలా గ్యాప్ తీసుకొని మళ్ళీ ఇంటెస్టింగ్ కథతో నానిని ఒప్పించి సరిపోదా శనివారం మూవీ చేస్తున్నారు. నాని కెరియర్ లో భారీ బడ్జెట్ తో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఆగస్టు 29న రానున్న ఈ సినిమాతో సూపర్ హిట్ అందుకోవాలని కసితో వివేక్ ఆత్రేయ ఉన్నారు. మరి ఈ దర్శకులకి 2024 సంవత్సరం ఎలాంటి విజయాలు అందిస్తుందనేది చూడాలి.





PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044